# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 247 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | మంగళవారం 28 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 247 28-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## శరణార్థులకు 3వేలు,25 కేజీల బియ్యం



**అమరావతి అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

%ూూ% అక్టోబర్ 27లి తుఫాను ప్రభావిత ప్రాంతాలలోని పునరావాస కేంద్రాలకు చేరిన శరణార్థులకు 3వేలు,25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. తుఫాను నేపద్యంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఆయన నిర్దేశించారు. 24గంటలూ మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేసి, ప్రజలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని చంద్రబాబు సూచించారు.

## జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా

# బాధ్యతలు స్వీకరణ



**అమరావతి అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.నేలపాడులోని రాష్ట్ర హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆయనతో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయించారు.జస్టిస్ మానవేంద్ర రాయ్ స్వస్థలం ఉమ్మడి విజయనగరం జిల్లా పార్వతీపురం.న్యాయవిద్య అభ్యసించిన తదుపరి 2002 లో జిల్లా జడ్జి క్యాడర్లో నియమితులై వీరు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో న్యాయ సేవలు అందజేశారు.2015 జూలై నుండి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ గా మరియు 2019 జూన్ నుండి ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందజేయగా 2023 నవంబర్ లో గుజరాత్ హైకోర్టుకు బదిలీపై వెళ్లారు.గుజరాత్ హైకోర్టు నుంచి బదిలీపై సొంత రాష్ట్రానికి వచ్చిన ఆయన తిరిగి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు.


ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో

- తరువాయి 2లో..

# వణికిస్తున్న మొంథా

## తుపానుగా బలపడిన వాయుగుండం

- ఏపీ తీరం వైపు 'మొంథా' తుపాను
- రేపటికి తీవ్రరూపం దాల్చే అవకాశం
- పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షాలు
- ప్రస్తుతం కాకినాడకు 570 కి.మీ దూరంలో కేంద్రీకృతం
- తీరం వెంబడి గంటకు 110 కి.మీ వేగంతో గాలులు
- నేడు కాకినాడ వద్ద తీరం దాటే అవకాశం
- సహాయక చర్యలకు రూ.19 కోట్లు విడుదల, అధికారుల సెలవులు రద్దు
- ప్రభావిత జిల్లాల్లోని విద్యాసంస్థలకు సెలవుల ప్రకటన




**అమరావతి అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి 'మిథాయ్' తుపానుగా మారింది. ఇది రేపు తీవ్ర తుపానుగా మారి మచిలీపట్నం–కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని

- తరువాయి 2లో..



## మాజీ రాష్ట్రపతి కె.ఆర్ నారాయణన్‌కి నివాళులర్పించిన ముర్ము

**న్యూఢిల్లీ, అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

నేడు భారత మాజీ రాష్ట్రపతి కె.ఆర్ నారాయణన్ జయంతి. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తదనంతరం పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినరు కుమార్ సక్సేనాలు ముర్మని కలిశారు. ఈ సందర్భంగా వారు ఆమెకు పుష్పగుచ్చాలను ఇచ్చారు. కాగా, అక్టోబర్ 28న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఎ) అసెంబ్లీ ఎనిమిదవ సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు.

## ఎమ్మెల్యేలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో


# అందబాటులో ఉండాలి

**అధికారులకు, ప్రజాప్రతినిధులకు మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు**

**అమరావతి అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రభుత్వ యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా తుపాను ప్రభావం అధికంగా ఉండే నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత సమాచారం ప్రకారం తుపాను కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ శాఖలన్నీ సమష్టిగా




- తరువాయి 2లో..

## ఏపీ రైల్వే ప్రాజెక్టుల పురోగతికి రాష్ట్రవ్యాప్తంగా రూ.33,630

# కోట్ల విలువైన పనులు

- ఏపీలో రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- ఏపీ రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్ పనుల పురోగతిపై చర్చ
- అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి, కొత్త లైన్ల ప్రతిపాదనల ప్రస్తావన
- సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి, రైల్వే ఉన్నతాధికారులు



**అమరావతి అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**


రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం రూ.33,630 కోట్ల విలువైన రైల్వే పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ఈ కీలక ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సమీక్షలో పలు ముఖ్యమైన రైల్వే లైన్ల పనుల పురోగతిపై అధికారులు నివేదిక సమర్పించారు. ముఖ్యంగా నడికుడి–శ్రీకాళహస్తి, గుంటూరు–గుంతకల్ డబ్లింగ్,

- తరువాయి 2లో..

## మొంథా తుఫాన్‌పై

# ప్రతీ గంటకూ బులిటెన్...


- రియల్ టైమ్‌లో అప్డేట్స్
- ఆస్తి-ప్రాణ నష్టం నుంచి రక్షించడమే ప్రభుత్వ లక్ష్యం
- నిరంతర సమాచారానికి శాటిలైట్ ఫోన్లు, మొబైల్ టవర్ల ఏర్పాటు
- పునరావాస కేంద్రాల్లోని వారికి నిత్యావసరాల పంపిణీ
- సమీక్షలో అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- తుఫాన్‌పై ముఖ్యమంత్రితో ఫోన్లో మాట్లాడిన ప్రధాని నరేంద్రమోదీ
- రాష్ట్రానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని భరోసా
- పీఎంవోతో సమన్వయ బాధ్యతలు మంత్రి లోకేష్‌కు అప్పగించిన సీఎం



**అమరావతి అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మొంథా తుఫాన్ ప్రభావాన్ని, నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరేలా రియల్ టైమ్‌లో సమాచారం అందించాలని ముఖ్యమంత్రి

- తరువాయి 2లో..





## తీరప్రాంత ప్రజల్ని పునరావాస కేంద్రాలకు

# తరలించండి..

- ప్రతీ కేంద్రానికి ఇన్‌ఛార్జ్...
- నాణ్యమైన ఆహారం, మెడికల్ క్యాంపులు
- తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు
- వాలంటరీగా వచ్చేవారితో సహాయక చర్యలు చేపట్టండి
- జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు నిర్దేశం

**అమరావతి అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మొంథా తుఫాన్ ముప్పు ఉన్న తీరప్రాంత ప్రజలను తక్షణం పునరావాస కేంద్రాలకు తరలించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం నుంచి తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండటంతో ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. పునరావాస కేంద్రాల్లో నాణ్యమైన ఆహారాన్ని అందించడంతో పాటు, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. పునరావాస కేంద్రాలకు ప్రత్యేకంగా ఇన్‌ఛార్జ్‌లను నియమించాలని ఆదేశించారు.

- తరువాయి 2లో..




## సైక్లోన్ ఎదుర్కోవడానికి

# సిద్ధంగా ఉన్నాం..

**జిల్లాలో ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకుండా పటిష్ట రక్షణ చర్యలు : ఇన్చార్జి మంత్రి పొంగూరు నారాయణ**

**కాకినాడ, అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మొంథా తుఫాను కారణంగా జిల్లాలో ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకుండా పటిష్ట రక్షణ చర్యలు చేపట్టి, అన్ని శాఖల సమన్వయంతో పంట, ఆస్తి నష్టాలను కనిష్ఠ స్థాయికి నియంత్రించాలని జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్ వివేకానందా హాలులో జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టనాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మొంథా తుఫాను కాకినాడ సమీపంలో తీరం దాటనుందని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరిక నేపద్యంలో విపత్తు నియంత్రణకు జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను, సంసిద్దతను సమీక్షించి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో బాటు జిల్లా తుఫాను ప్రత్యేకాధికారి, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణ తేజ, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, ఎంపీలు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, గంటి హరీష్ మాధూర్,

- తరువాయి 2లో..



## జిల్లాలో 12 మండలాలపై మొంథా ప్రభావం

# పగడ్బందీగా ముందస్తు చర్యలు

**కాకినాడ, అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మొంథా తుపాను కాకినాడ సమీపంలో తీరం దాటనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రాణ నష్టాన్ని నివారించడమే ప్రథమ కర్తవ్యంగా భావించి, ముందస్తు రక్షణ చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావం, సహాయక చర్యలపై కాకినాడ జిల్లా ఇంఛార్జి మంత్రి నారాయణ, స్పెషల్ ఆఫీసర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ బిందు మాధవ్, ఇతర ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "మొంథా తుపాను

- తరువాయి 2లో..

## సంపాదకీయం

# నగరమా.. నరకమా?

దేశ రాజధానిలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 400 దాటింది. ప్రపంచంలో నివాసయోగ్యం కాని నగరం ఏదైనా ఉన్నదా అంటే దానికి సమాధానం ఢిల్లీ అని చెప్పవచ్చు. తీవ్రస్థాయిలో విషపూరిత పొగమంచు దేశ రాజధాని ఢిల్లీ మొత్తాన్ని కమ్మేసింది. దీంతో ఊపిరి పీల్చుకోవడానికి ఢిల్లీ తల్లడిల్లిపోతోంది. దేశ రాజధాని నరకంలా మారింది. ఢిల్లీ వరుసగా మూడో రోజూ వాయు కాలుష్యం అతి తీవ్రస్థాయిలోనే ఉంది. ఇవాళ వాయు నాణ్యత సూచీ 402 కి చేరింది. జహంగీర్‌పురి ప్రాంతంలో ఈ సూచీ 506, సోనియా విహార్‌లో 462 కి పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మితిమీరిన కాలుష్యంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దేశ రాజధాని నగరాన్ని నరకంగా మార్చేసిన వాయు కాలుష్యం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. కాలుష్య తీవ్రత పెరిగిన నేపథ్యంలో ఢిల్లీలో పలు ఆంక్షలు అమలు చేస్తున్నారు. నిర్మాణ పనులపై ఆంక్షలు విధించారు. లైట్ కమర్షియల్ వాహనాలు, డీజిల్‌ట్రక్కుల రాకపోకలను నిషేధించారు. భవన నిర్మాణ పనులను, కూల్చివేతలను నిషేధిస్తున్నట్లు ఢిల్లీ పర్యావరణ శాఖ ప్రకటించింది. కాలుష్యం కేవలం ఢిల్లీకే పరిమితం కావడం లేదు. రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్, గ్రేటర్ నోయిడా తదితర ప్రాంతాల్లోనూ వాయు నాణ్యత దిగజారింది. ఢిల్లీలో విష వాయువుల గాఢత ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిమితుల కంటే 50 రెట్లు ఎక్కువగా ఉండడంతో వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యం కారణంగా ఢిల్లీలో దగ్గు, జలుబు, గొంతు ఇన్ఫెక్షన్లు, కంటి దురదతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ సీజన్‌లో ఇలా కాలుష్య తీవ్రత పెరగడం ఇదే తొలిసారి. దీంతో ఢిల్లీ- ఎన్‌సిఆర్ ప్రాంతాన్ని అతి తీవ్ర కాలుష్య జోన్‌గా గుర్తించారు. రెండు వారాల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. గత దశాబ్ది కాలంగా ఇదే పరిస్థితి. ఢిల్లీ, యుపి, హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో పంటలను తగులబెట్టడం వల్ల, అలాగే పరిశ్రమల నుండి వెలువడుతున్న విష వాయువుల వల్ల విపరీతమైన దుస్థితి ఏర్పడింది. ఈ పాపం నాది కాదు అంటే నాది కాదని రాష్ట్రాలు ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ఢిల్లీలో ప్రమాద ఘంటికలు మోగిస్తోన్న వాయు కాలుష్యం సోమవారం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 402, అలాగే రెస్పిరబుల్ పార్టీకు లెట్ మ్యాటర్ 380, నైట్రోజెన్ దయాక్సయిడ్ 32, సల్ఫర్ దయాక్సయిడ్ 13, ఓజోన్ 68, కార్బన్ మోనాక్సయిడ్ 21 గా ఉంది. గాలి నాణ్యత క్షీణిస్తున్న నేపథ్యంలో ప్రజలు ముఖ్యంగా వయోజనులు, పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. శ్వాసకోశ సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అంబేద్కర్ మార్గంలో 'కోట' కొట్లాట ఢిల్లీ సహా పరిసర ప్రాంత ప్రజలు గడపదాటి బయటకు రావాలంటే మాస్కు ధరించక తప్పని పరిస్థితి నెలకొంది. కోరలు చాచిన వాయు కాలుష్యం ఈదుస్థితిని తీసుకొచ్చింది. చలికాలం వచ్చిందంటే చాలు ఢిల్లీలో పీల్చే గాలి విషంగా మారుతున్నది. రుతుపవనాల తిరోగమనం అనంతరం ఉత్తరాదిన ఏర్పడే ప్రత్యేక వాతావరణ పరిస్థితులు ఒక కారణమైతే, మానవ తప్పిదాలు ఈ వాయు కాలుష్యం స్థాయిలను మరింత పెంచి పీల్చే గాలిని విషతుల్యం చేస్తున్నాయి. ఢిల్లీ నగరంలోని వాహన ఉద్గారాలు తోడు పొరుగు రాష్ట్రాలు పంజాబ్, హర్యానా రైతులు పంట వ్యర్థాలను కాల్చడం వల్ల ఏర్పడే పొగ శీతాకాలంలో సహజ సిద్ధంగా ఏర్పడే పొగమంచుతో కలిసిపోయి ఊపిరి పీల్చుకోలేని ఉక్కిరిబిక్కిరి పరిస్థితి సృష్టిస్తున్నాయి. భవన నిర్మాణ పనుల కారణంగా ఏర్పడే దుమ్ము, ధూళి అన్నీ కలగలిపి గాలి నాణ్యతను దారుణంగా దెబ్బ తీస్తున్నాయి. పొల్యూషన్ మానిటరింగ్ మెకానిజం లేక ప్రజలకు కాలుష్యం దుష్ప్రభావాలు తెలిపక తీవ్ర సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న పారిశ్రామిక సాంకేతిక విధానాలు ప్రకృతి విధ్వంసానికి కారణాలు అవుతున్నాయి. ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డయాక్సైడ్, ఆర్గాన్, నీటి ఆవిరి సమతుల్యంగా ఉంటేనే వన్యప్రాణి, వ్యవసాయానికి, మానవుని అభివృద్ధికి తోడ్పడుతుంది. వాయువులు, కణాలు, జీవ అణువులతో సహా హానికరమైన లేదా అధిక పరిమాణంలో ఉన్న పదార్థాలను భూమి వాతావరణంలోకి ప్రవేశపెట్టినప్పుడు వాయు కాలుష్యం సంభవిస్తుంది. ఇది మానవులకు వ్యాధులు, అలెర్జీలు, మరణానికి కారణం కావచ్చు. ఇది జంతువులు, ఆహార పంటలు వంటి ఇతర జీవులకు కూడా హాని కలిగించవచ్చు. సహజమైన లేదా నిర్మించిన వాతావరణాన్ని దెబ్బతీస్తుంది. మానవ కార్యకలాపాలు, సహజ ప్రక్రియలు రెండూ వాయు కాలుష్యాన్ని సృష్టించగలవు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం, వాయు కాలుష్యం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఏటా 8 మిలియన్ల మంది మరణాలకు కారణమైంది. పరిశ్రమలు, రవాణా మొదలైన ప్రజల కార్యకలాపాల ద్వారా తయారైన విష పదార్థాలు సమాజాన్ని చుట్టే గాలిని కలుషితం చేస్తాయి. ప్రధాన కాలుష్య కారకాలు దహన, చెత్తను తగులబెట్టినప్పుడు రసాయన ప్రతిచర్యల వల్ల దుమ్ము, మసి, ఆటోమొబైల్ పెట్రోలియం వాహనాల ద్వారా ఎగ్జాస్ట్ గ్యాస్ వంటి సల్ఫర్ వాయువులో ఉండే నత్రజని ఆక్సైడ్లు, కాలుష్యం ప్రజల ఆరోగ్యాన్ని, ఆస్తిని, జంతువులు, మొక్కలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. సహజ పరిస్థితులు, క్షీణత, శ్వాసకోశ వ్యాధులు, శ్వాసనాళ ఆస్తమా వంటి వివిధ వ్యాధుల ప్రేరణ. వాయు కాలుష్యం తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలకు కారణమయ్యే పిఎం 2.5, పిఎం 0.5 వంటి చక్కటి రేణువుల హానికరమైన పదార్థాలను కలిగి ఉంది. ఏసిలు, రిఫ్రిజిరేటర్లు విపరీతంగా వాడడం వలన క్లోరోఫ్లోరో కార్బన్లు, ద్రావకాలు, రిఫ్రిజిరేటర్లకు ఉపయోగించే వాయువుల ద్వారా ఓజోన్ పొరను నాశనం చేసి వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ వాయువు సాంద్రత పెరగడం వల్ల గ్రీన్‌హౌస్ ప్రభావం వాతావరణంలో పర్యావరణ విధ్వంసం సమస్యగా దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

## జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరణ

హైకోర్టు న్యాయమూర్తులు,అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్,అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చిదంబరం,ఎపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్.ద్వారకానాథ్ రెడ్డి అదనపు అడ్వకేట్ జనరల్ ఇ.సాంబశివ ప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారధి,పలువురు ఇతర రిజిస్ట్రార్లు,సీనియర్ న్యాయవాదులు,బార్ అసోసియేషన్,బార్ కౌన్సిల్ సభ్యులు మరియు హైకోర్టు ఉద్యోగులు,ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ,ఎపి జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏపీ కోస్తాపై.. మొంథా ప్రభావం

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు.వాతావరణ శాఖ వివరాల ప్రకారం.. ఈ తుపాను ప్రస్తుతం విశాఖపట్నానికి దక్షిణ ఆగ్నేయంగా 710 కి.మీ, కాకినాడకు ఆగ్నేయంగా 680 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. పశ్చిమ వాయవ్య దిశగా గంటకు 16 కిలోమీటర్ల వేగంతో కదులుతున్న ఈ తుపాను, మంగళవారం ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో తీరం వెంబడి గంటకు 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు.

### ప్రభుత్వం ముందస్తు చర్యలు

మిథాయ్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. తక్షణ సహాయక చర్యల కోసం రూ.19 కోట్లు విడుదల చేసింది. సంబంధిత అధికారులందరి సెలవులను రద్దు చేసి, విధులకు హాజరు కావాలని ఆదేశించింది. తీర ప్రాంతాల్లోని 57 మండలాల్లో 219 తుపాను పునరావాస కేంద్రాలను (షెల్టర్లు) సిద్ధం చేశారు. సముద్రంలో వేటకు వెళ్లిన 62 మెకనైజ్డ్ బోట్లను వెనక్కి రప్పించే పనులు చేపట్టారు. తీర ప్రాంతాల్లో పర్యాటకుల రాకపోకలను పూర్తిగా నిషేధించారు.

### సహాయక బృందాలు, పాఠశాలలకు సెలవులు

ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సహాయక బృందాలను సిద్ధంగా ఉంచింది. 9 ఎస్డీఆర్ఎఫ్, 7 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ప్రభావిత ప్రాంతాలకు తరలించారు. జిల్లాల్లో తాగునీరు, ఆహారం, సహాయ శిబిరాల ఏర్పాటు కోసం టీఆర్-27 కింద నిధులు మంజూరు చేశారు. ముందుజాగ్రత్త చర్యగా అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో విద్యాసంస్థలకు ఎల్లుండి వరకు సెలవులు ప్రకటించారు. పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, కడప జిల్లాల్లో రేపటి వరకు, నెల్లూరు జిల్లాలో నేడు సెలవు ఇస్తున్నట్లు ఆయా జిల్లాల కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఎమ్మెల్యేలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో అందబాటులో ఉండాలి

పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. అవసరమైతే సహాయక చర్యలలో కూటమి పార్టీల కార్యకర్తలు కూడా పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. తుపాను ప్రభావిత తీరప్రాంతాలు, లంక గ్రామాల్లోని ప్రజల కోసం తక్షణమే సహాయ శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ శిబిరాలలో నిరాశ్రయులకు అవసరమైన ఆహారం, తాగునీరు వంటి సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, దీనిని నివారించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ సూచించారు. అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్‌లు, మందులను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అదేవిధంగా, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా సంబంధిత శాఖ సిబ్బంది పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుపాను సమయంలో కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినకుండా చూసే బాధ్యతను సెల్ ఫోన్ ఆపరేటర్లు తీసుకోవాలని కోరారు. భారీ వర్షాలకు చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం ఉన్నందున ఇసుక బస్తాలు, యంత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పంట పొలాల్లో నీరు నిలిచిపోయే ప్రమాదం ఉన్నందున, నీటిని బయటకు పంపేందుకు అవసరమైన ఆయిల్ మోటార్లను సిద్ధంగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు. 'మొంథా' తుపాను పరిస్థితులను గమనిస్తూ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, బాధితులకు ఏ సాయం అవసరమైనా స్పందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం 24 గంటలూ సిద్ధంగా ఉంటుందని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు.

## ఏపీ రైల్వే ప్రాజెక్టుల పురోగతికి రాష్ట్రవ్యాప్తంగా రూ.33,630 కోట్ల విలువైన పనులు

గుణదల-ముస్తాబాద్ బైపాస్, రాయదుర్గ్-తుముకూరు మధ్య కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులు ఎంతవరకు వచ్చాయో చర్చకు వచ్చింది. వీటితో పాటు, రాష్ట్రంలో కొత్తగా చేపట్టాల్సిన రైల్వే లైన్లు, అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రైల్వే స్టేషన్ల అభివృద్ధి, రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ), అండర్ బ్రిడ్జి (ఆర్ యూబీ)ల నిర్మాణానికి సంబంధించి రైల్వే శాఖకు పంపిన ప్రతిపాదనలపైనా సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ శ్రీవాస్తవ, తూర్పు, దక్షిణ కోస్తా రైల్వేలకు చెందిన పలువురు కీలక అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖ సమన్వయంతో పనిచేయాలని ఈ సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం.

## మొంథా తుఫాన్‌పై ప్రతీ గంటకూ బులిటెన్...

నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి మంగళవారం ఉదయం నుంచి ప్రతీ గంటకూ తుఫాన్ బులిటెన్లు విడుదల చేస్తూ, అప్రమత్తం చేయాలని సూచించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో మొంథా తుఫాన్ కారణంగా నెలకొన్న పరిస్థితులు, చేపట్టాల్సిన సహాయక చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ఎక్కడా సమాచార పంపిణీ వ్యవస్థకు అంతరాయం కలగకుండా చూసుకోవాలని చెప్పారు. కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు శాటిలైట్ ఫోన్లు వినియోగించాలని, మొబైల్ టవర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తుఫాన్ ప్రభావం ఎక్కువ ఉండే 2,707 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. 110 మండలాల్లోని సచివాలయాల్లో 3,211 జెనరేటర్లను పవర్ బ్యాకప్ కోసం వినియోగించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఎక్కడా కమ్యూనికేషన్ వ్యవస్థకు అవాంతరాలు తలెత్తకూడదన్నారు. తుఫాన్ వల్ల ఎవరూ ప్రమాదాలబారిన పడకూడదని, ఒక్క మరణం సంభవించకూడదనేది ప్రభుత్వ లక్ష్యం కావాలన్నారు. సముద్ర తీరంలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. వారికి 25 కేజీల బియ్యంతో సహా నిత్యావసరాలు అందించాలన్నారు. కరువును ఎదుర్కొనేందుకు ఎలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామో, తుఫాన్లను ఎదుర్కొనేందుకూ పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు జరపాలని సీఎం చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రధానికి వివరించగా, కేంద్రం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని భరోసా ఇచ్చారని తెలిపారు. ప్రధాని కార్యాలయంతో సమన్వయం చేసుకునే బాధ్యతను మంత్రి లోకేష్‌కు ముఖ్యమంత్రి అప్పగించారు.

### కృష్ణా జిల్లాలో అతిభారీ వర్షాలకు అవకాశం ??

ప్రస్తుతం కాకినాడకు 680 కి.మీ. దూరంలో ఉన్న మొంథా తుఫాన్...16 కి.మీ వేగంతో తీరానికి చేరువ అవుతోందని... దీని ప్రభావంతో ఇప్పటికే ఉత్తర, దక్షిణ కోస్తాలో వర్షాలు కురుస్తున్నాయని... మంగళవారం కృష్ణా జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విద్యాసంస్థలకు ఇప్పటికే సెలవులు ప్రకటించామని తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులందరినీ వెనక్కి రప్పించినట్టు వెల్లడించారు. గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని తెలిపారు. మంగళవారం రాత్రికి తుఫాన్ తీరానికి చేరే అవకాశం ఉందన్నారు. ఎక్కువ వర్షపాతం కురిసే ప్రాంతాలను గుర్తించి జిల్లా అధికారులు ముందస్తు రక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎన్డీఆర్, ఎస్డీఆర్ దళాలు అందుబాటులో ఉండాలని, ఫైర్ సర్వీసెస్ కూడా అలెర్ట్‌గా ఉండాలని చెప్పారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ టీమ్, రహదారులు-భవనాల శాఖ, విద్యుత్ శాఖ పూర్తి అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. రహదారులు కోతకు గురైనా, విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడినా వెంటనే పునరుద్ధరించేలా మెటీరియల్, మిషనరీ సిద్ధం చేయాలని, కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. తుఫాను అనంతరం అంటువ్యాధులు సోకకుండా పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. తుఫాను సమయంలో గర్భిణిలు, బాలింతలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా 108, 104 వాహనాలను అందుబాటులో ఉంచి వైద్య సౌకర్యాలు కొనసాగేలా చూడాలన్నారు. యాంటీ స్నేక్ వెనోమ్, యాంటి ర్యాబిస్ వ్యాక్సిన్లు కూడా అన్ని పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. మరోవైపు పంటనష్టం సంభవించకుండా టార్పాలిన్లు విరివిగా ఉంచాలని, పశుసంపద నష్టపోకుండా చూడాలని ముఖ్యమంత్రి చెప్పారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో 851 జేసీబీలు, 757 పవర్ సాలు సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, ఏ ప్రాంతంలో అందుబాటులో ఉంచారనేది మ్యాపింగ్ చేయాలని... తుఫాన్ అనంతరం వీటన్నింటి వినియోగంపైనా ఆడిటింగ్ చేస్తామని సీఎం చెప్పారు. వరద నీరు వెళ్లేందుకు వీలుగా డ్రెయిన్లలో బ్లాక్స్ లేకుండా పటిష్టం చేయాలని నిర్దేశించారు.

### విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు ??

'తుఫాన్ తీరం దాటే సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగేందుకు అవకాశం ఉంటుంది. ఆ సమయంలో ప్రజలు ఎవరూ బయటకు రాకుండా అలర్ట్ చేయాలి. ఎప్పటికప్పుడు సందేశాలు పంపించి అవగాహన పెంచాలి. తిత్లీ, హరికేన్, హుద్‌హుద్ తుఫాన్లపై అనుభవాన్ని ఇందుకు వినియోగించాలి. అన్ని రిజర్వాయర్లు, ట్యాంకులు ఎలా నిర్వహించాలనే దానిపై జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయండి. రియల్ టైమ్‌లో నీటి ప్రవాహాలను పర్యవేక్షించాలి. బలమైన గాలులకు కూలిపోయే అవకాశం ఉన్న చెట్ల కొమ్మలను ముందుగానే తొలిగించాలి.' అని అధికారులతో ముఖ్యమంత్రి అన్నారు. అలాగే తుఫాన్ రక్షణ విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని ముఖ్యమంత్రి హెచ్చరించారు. సమీక్షలో మంత్రులు లోకేష్, అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖలకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తీరప్రాంత ప్రజల్ని పునరావాస కేంద్రాలకు తరలించండి..

సోమవారం ఉదయం సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి మొంథా తుఫాన్‌పై అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి, మధ్యాహ్నం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో టెలీకాన్ఫరెన్స్ చేపట్టారు. తాగునీటి సమస్య తలెత్తకుండా, ఎక్కడా కలుషితం కాకుండా చూసుకోవాలని చెప్పిన సీఎం అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. తుఫాను ప్రభావిత జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలని స్పష్టం చేశారు. ఎక్కడా ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా అధికారులు బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు నిర్దేశించారు. జిల్లాల్లో తుఫాను రక్షణ చర్యలను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని, వాలంటరీగా వచ్చేవారిని తుఫాన్ సహాయక కార్యక్రమాలకు వినియోగించుకోవాలని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగమంతా నిబద్ధతతో పనిచేసి మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలని అన్నారు.

### కొండచరియలు జారిపడకుండా జాగ్రత్తలు

మానవ ప్రయత్నంలో ఎటువంటి అలసత్వం కనిపించకూడదని చెప్పిన ముఖ్యమంత్రి... వివిధ జిల్లాల కలెక్టర్లతో అక్కడ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నెల్లూరు జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయని... అన్ని రక్షణ చర్యలు తీసుకున్నామని ఆ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సీఎంకు వివరించారు. ఆర్టీజీఎస్ నుంచి సమాచారం ఎప్పటికప్పుడు అందుతుందని... ఎక్కడా చెరువులు, కాలువ గట్లు తెగకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. భారీ వర్షాలతో నీరు ఎక్కడా నిలిచిపోకుండా డ్రైనేజీ వ్యవస్థను పర్యవేక్షించాలన్నారు. తుఫాను సమయంలో ప్రజలు ఎవరూ బయటకు రాకుండా చూసుకోవాలని చెప్పారు. విజయవాడ, మంగళగిరి, విశాఖ వంటి కొండ ప్రాంతాల్లో కొండచరియలు జారిపడి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. మొంథా తుఫాన్ కార్యాచరణ భవిష్యత్‌లో వచ్చే తుఫాన్లను ఎదుర్కొనేందుకు ఒక మోడల్ కావాలని చెప్పారు.

## సైక్లోన్ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం..

ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ,, పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు, డసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జి.బిందుమాధవ్ మొంథా తుఫాను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టిన కార్యాచరణలను మంత్రికి వివరించారు. అలాగే మొంథా తుఫాను ఉధృతి 1996లో వచ్చిన తుఫాను స్థాయిలో ఉండే అవకాశం ఉన్నందున నాటి అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా ఇన్ చారి మంత్రి నారాయణ మాట్లాడుతూ తుఫాను పరిస్థితిపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షించి ఆదేశాలు జారీ చేస్తున్నారని, తుఫాను కారణంగా కాకినాడ జిల్లాలో ఒక్క ప్రాణానికి కూడా నష్టం కలుగకుండా అధికారులు పటిష్టమైన రక్షణ, సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే తుఫాను కారణంగా పంటలకు, ఆస్తులకు జరిగే నష్టాలను కనిష్ట సాయికి ఉండేలా నియంత్రించాలని కోరారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సమీక్షలో చర్చించిన అంశాలను, మొంథా తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లాలో చేపట్టిన చర్యలను వివరించారు. అవి - వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన " మొంథా తుఫాను" వేగంగా కాకినాడ తీరం సమీపములో ఈనెల 28వ సాయంత్రం నుండి 29వ తేదీ తెల్లవారు లోపు తీరాన్ని దాటే అవకాశం ఉన్న దృష్ట్యా సందర్భముగా కాకినాడ జిల్లాలో తుపాను నష్టాల నివారణకు ప్రభుత్వము ఈ తుఫాను వలన ఎటువంటి ప్రాణనష్టం లేకుండా, పంట, ఆస్తి నష్టాలను కనిష్ట స్థాయికి నియంత్రించేందుకు ప్రభుత్వం తరపున అన్ని జాగ్రత్తలు, చర్యలు తీసుకున్నాం. అన్ని శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పటిష్టంగా అమలు చేస్తున్నాం. -జిల్లా కేంద్రంలోను, అన్ని మండలములలోను 24%ఇ%7 పని చేసే విధముగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయుట జరిగినది. ముఖ్యముగా తీర ప్రాంత మండలములైనటువంటి ఉప్పాడ కొత్తపల్లి, తాళ్లరేవు, తొండంగి, కాకినాడ రూరల్ %ఃడ% అర్బన్ మరియు సరిహద్దు మండలములలో మండల/గ్రామ సిబ్బందిని తుఫాను రక్షణ చర్యలు తీసుకొను విధముగా అప్రమత్తంగా ఉంచడం జరిగినది. -ప్రజలకు తుఫాను సమాచారం ఎప్పటికప్పుడు స్థానిక రేడియో, టీవీ, సోషల్ మీడియా ద్వారా తెలియజేసి, తుఫాను సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు పై అవగాహన కల్పించడం జరుగుతున్నది. ప్రతి గ్రామంలో వలంటీర్ ద్వారా "తుఫాను హెచ్చరిక వ్యవస్థ" ను రియల్ టైమ్ అందించడం జరుగుతున్నది. -పాఠశాల భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ వసతి గృహాలలో తాత్కాలిక పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రతి పునరావాస కేంద్రానికి ఇంచార్జ్ లను నియమించడం జరిగింది. అన్ని పునరావాస కేంద్రాల వద్ద త్రాగునీరు, ఆహారం, విద్యుత్, వైద్య సహాయం, మొబైల్ ఛార్జింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగినది. జిల్లాలో మొత్తం 269 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ఇన్ చార్జులను నియమించాం. 7 రోజులకు సరిపడా నిత్యావసరాలు, మందుల నిల్వలు ఏర్పాటు చేసాం. -పునరావాస సిబ్బందికి, సచివాలయ సిబ్బంది మరియు యితర అధికారులకు తుఫాను సమయములో తీసుకొనవలసిన జాగ్రత్తల పై శిక్షణ యివ్వడం జరిగినది. సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్ళి తుఫాను సమయములో తీసుకొనవలసిన జాగ్రత్తల పై తగిన సూచనలు ఇవ్వడం జరిగింది. నిత్యావసర వస్తువులు, పాలు, కూరగాయలు, పండ్లు అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. తుఫాను ప్రభావిత ప్రాంత ప్రజలకు మరియు మత్స్యకారులకు ఆర్థిక సహాయం, బియ్యం మరియు అవసరమైన వస్తువులు అందేలా ఫుడ్ ప్యాక్స్ సిద్ధం చేయడం జరిగినది. పునరావాస కేంద్రాలకు తరలించిన ప్రజలు తుఫాను ముప్పు తొలగే వరకూ ఇంటికి వెళ్లిపోకుండా ప్రజాప్రతినిధులతో నచ్చజెప్పి ఒప్పించి, పోలీస్ సిబ్బందిని పర్యవేక్షణ ఉంచుతున్నాం. ఉప్పాడ, మూలపేట, కోనపాపపేటలలో కుకింగ్ సెంటర్ల ఏర్పాటుతో బాటు, అన్నవరం దేవస్థానం, అక్షయ, అల్లూరి సీతారామరాజు ఫౌండేషన్ల ద్వారా 10 వేలు చప్పున ఆహార పాకెట్లు సరఫరా చేయనున్నాం. హెూప్ ఐలాండ్ లో నివశిస్తున్న ప్రజలను ఇప్పటికే పునరావాస కేంద్రాలకు తరలించాం. 50 మందితో ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలు, 30 మందితో ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలను అందుబాటులో సంసిద్ధంగా ఉంచాం. ముంపు ప్రాంతములకు గురయ్యే ప్రజలను సురక్షిత ప్రాంతములలో చేరవేసేందుకు 40 బోట్లను, 100 మంది సిబ్బందిని, 140 గజ ఈతగాళ్లను అత్యవసర అవసరాల కోసము అందుబాటులో ఉంచాం. -తీర ప్రాంత మండలాలైన ఉప్పాడ కొత్తపల్లి, తాళ్లరేవు, తొండంగి, కాకినాడ రూరల్, అర్బన్, సరిహద్దు మండలములలో అవసరమైనటువంటి సహాయక చర్యల కోసం లారీలు, టిప్పర్లు, క్రేన్లు, జెసిబీలు, ట్రాక్టర్ లు అందుబాటులో ఉంచాం. అవసరమైన జనరేటర్స్ ను, టార్చ్ లైట్లను, ఇంధన నిల్వలు అన్ని మండల కేంద్రములలోను సిద్ధంగా ఉంచుట జరిగినది. -142 గర్భిణీ స్త్రీలు, బాలింతలు, శిశువులను ముందుగ జాగ్రత్తగా దగ్గరలో ఉన్న ఆసుపత్రులకు, సురక్షిత ప్రాంతాలకు తరలించాం. జిల్లాలో 108 అంబులెన్స్ లు 23 వాహనాలు, 104 వాహనములు 35, రోగులను తరలించేందుకు అందుబాటులో ఉంచుట జరిగినది.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మొబైల్ వైద్య బృందాలను ఏర్పాటు చేయుట జరిగినది. పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, 7 రోజులకు సరిపడ అత్యవసర మందుల నిల్వలను అన్ని సి హెచ్ సి , పి హెచ్ సిల యందు, వైద్య శిబిరాల యందు అందుబాటులో ఉంచడం జరిగినది.అవసరమైన అదనపు వైద్య సిబ్బందిని సి హెచ్ సి పిఠాపురం, తాళ్ళరేవు మండలములలో నియమించడం జరిగినది. జిల్లాలో అవసరమైన ప్రథమ చికిత్స కిట్స్ ను అన్ని సచివాలయములలో అందుబాటులో ఉంచుట జరుగుతుంది. గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు మరియు శిశువులకు అవసరమైన పౌష్టిక ఆహారము అందుబాటులో ఉంచుడం జరిగినది. -అన్ని పాఠశాలలకు ఈనెల 27 నుండి 29వ తేదీ వరకు సెలవులు ప్రకటించాం. 101 వసతి గృహాలు మరియు గురుకుల విద్యాలయములో ఉన్న 14,499 విద్యార్థులను వారి వారి సొంత ఇళ్ళకు తరలించడం జరిగినది.-మత్స్యకార గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వేటకు వెళ్ళకుండా నిషేధమును అమలు చెయ్యడం జరిగినది.ఇప్పటికే సముద్రం వేటలో ఉన్న 600 పడవలను తీరానికి సురక్షితంగా వెనకకు రప్పించే చర్యలు తీసుకోవడం జరిగినది. -త్రాగునీటి చెరువులు, ట్యాంకులు మరియు యితర ప్రాంతములు కలుషితం కాకుండా చర్యలు తీసుకొని, త్రాగునీటిని ప్రజలకు అందుబాటులో ఉండేటట్లు అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొనుట జరిగినది.అలాగే శిక్షణ పొందిన 300 మంది ఫైర్ సిబ్బంది, 35 మంది అధికారులను అత్యవసర సేవల కొరకు సిద్ధంగా ఉంచాం. -రోడ్లపై పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించి, రవాణా మార్గాలకు ఎటువంటి అడ్డంకి మరియు ట్రాఫిక్ రద్దీ లేని విధంగా పునరుద్దరణకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నది. తుఫాను ప్రభావిత ప్రాంతాల బస్సు సర్వీస్ లు రద్దు చేయడం జరిగినది. -తుఫానుకు సంబంధించి ప్రభుత్వ సంస్థలు, వాతావరణ శాఖ, విపత్తుల నియంత్రణ శాఖ, జిల్లా యంత్రాంగం తెలియజేసే సమాచారాన్నే విశ్వసించాలని ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. అవాస్తవాలను, ఊహాగానాలను ప్రచారం చేసి ప్రజలను అయోమయానికి, భయాందోళనలకు గురి చేయవద్దని సోషల్ మీడియాకు సూచించారు. - మొంథా తుఫాను సందర్భంగా "ఒక్క ప్రాణం కూడా నష్టం పోకూడదనేదే" ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి నారాణయణ తెలియజేశారు.

## జిల్లాలో 12 మండలాలపై మొంథా ప్రభావం పగడ్బందీగా ముందస్తు చర్యలు

ప్రభావం కాకినాడ జిల్లాలోని 12 మండలాలపై అధికంగా ఉంటుందని సమాచారం. రేపు కాకినాడ పరిసర ప్రాంతాల్లో తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు, అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. యంత్రాంగం 24 గంటలూ అందుబాటులో ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. తీర ప్రాంత ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ఇప్పటికే జిల్లాలో 260 పునరావాస కేంద్రాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు, పాలు, అత్యవసర ఔషధాలు సిద్ధంగా ఉంచాలి" అని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కళ్యాణ్ సూచించారు. "పిఠాపురం నియోజకవర్గంతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న గర్భిణులను సురక్షిత ప్రదేశాలకు తరలించాలి. ఇప్పటికే 142 మంది గర్భిణులను పునరావాస కేంద్రాలకు చేర్చినట్లు కలెక్టర్ తెలిపారు. వారికి అవసరమైన పౌష్టికాహారం, వైద్య సేవలు నిరంతరం అందేలా చూడాలి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసిన విషయాన్ని ప్రజలకు తెలియజేయాలి. తుపానుపై భయాందోళనలు సృష్టించకుండా, గ్రామాల్లో మైకుల ద్వారా సహాయక చర్యలను వివరిస్తూ ప్రజలకు ధైర్యం చెప్పాలి" అని ఆయన అన్నారు.

### అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

తుపాను సహాయక చర్యల్లో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాలకు తరలివెళ్లిన ప్రజల ఇళ్లకు దొంగల బెడద లేకుండా పోలీసులు ప్రత్యేక భద్రత కల్పించాలని, అవసరమైతే సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున, ఆయకట్టు ప్రజలను జలవనరుల శాఖ అధికారులు ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. బలహీనంగా ఉన్న చెరువు కట్టలు, కాలువ గట్లను గుర్తించి ఇసుక బస్తాలతో పటిష్ఠం చేయాలని సూచించారు. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా కట్టడి చేయాలని, వారి బోట్లకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులకు తెలిపారు. తుపాను కారణంగా నిత్యావసర వస్తువుల సరఫరాకు ఆటంకం కలగకుండా మార్కెటింగ్ శాఖ చూడాలన్నారు. విద్యుత్ స్తంభాలు, కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉన్నందున, మరమ్మతుల కోసం సిబ్బందిని సిద్ధం చేయాలని, అత్యవసర సమాచారం కోసం శాటిలైట్ ఫోన్లను వినియోగించాలని సూచించారు.

### కాకినాడకు కోటి రూపాయల అత్యవసర నిధి

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ. 19 కోట్లు విడుదల చేయగా, అందులో కాకినాడ జిల్లాకు ప్రత్యేకంగా రూ. కోటి కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ నిధులను పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, బాధితులకు నిత్యావసరాల పంపిణీ, దెబ్బతిన్న ఇళ్లకు తక్షణ సాయం అందించడం వంటి కార్యక్రమాలకు వినియోగించాలని అధికారులకు స్పష్టం చేశారు.




## పినిపే శ్రీకాంత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు

అమలాపురం అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అమలాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ గారి జన్మదినం సందర్భంగా ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరి గారు, రాఅమలాపురం విచ్చేసి శ్రీకాంత్ గారిని కలిసి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు.

## 43 రైళ్లు రద్దు చేసిన రైల్వే..




అమరావతి అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి మొంథా తుపానుగా మారడంతో ఈస్ట్ కోస్ట్ రైల్వే అప్రమత్తమైంది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా 43 రైళ్ల సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

## ముంథా తుఫాన్ కి భయపడకండి, ఇంట్లోనే జాగ్రత్తగా ఉండండి..

అమలాపురం అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ముంథా తుఫాన్ కి భయపడకండి, ఇంట్లోనే జాగ్రత్తగా ఉండండి..అమలాపురం నియోజకవర్గ పరిసర ప్రాంత ప్రజలకు జనసేన నాయకులకు కార్యకర్తలకు అమలాపురం జనసేన నాయకులు నల్లా శ్రీధర్ మనవి. .సూచించారు. : వాతావరణ శాఖ హెచ్చరిక ప్రకారం.. తుఫాన్ ప్రభావం కోనసీమలో ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. మనమంతా జాగ్రత్తగా ఉండి ముందస్తు చర్యలు తీసుకుందామని చెప్పారు. జనసైనికులు ముందుకు వచ్చి తోటివారికి ప్రభుత్వ అధికారులతో సహాయం చేయాచలని పిలుపునిచ్చారు. సముద్ర తీర మత్స్యకారులు తుఫాన్ ప్రభావం తగ్గేవరకు వేటలకు వెళ్లవద్దన్నారు. జనసేన నాయకులు కార్యకర్తలు అందరూ అప్రమత్తంగా ఉండి తుఫాన్ సమయంలో పరిసర ప్రాంత ప్రజలకు అండగా ఉండి అధికారులతో సహాయక కార్యక్రమాలు అందించాలని చెప్పారు.

## తుపాను బాధితులకు సాయమందించండి




అమలాపురం అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తుపాను బాధితులందరికీ సహాయ సహకారాలు అందించాలని అమలాపురం జనసేన నాయకులు లింగోలు పండు అమలాపురం నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులకు వీర మహిళలకు జన సైనికులకు జనసేనపార్టీ తరఫున అందరికీ విన్నవించారు. ముంథాతుఫాన్ ప్రభావతం వల్ల మన నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ వారి వారి గ్రామాలలో ప్రభుత్వం వారికి తుఫాను కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటు ప్రజానీకానికి మీకు సాధ్యమైనంత వరకు సహాయ సహకారాలుఅందిస్తూ మిమ్మల్ని మీరు కాపాడుకుంటూ మానవతాదృక్పథంతో తోటి ప్రజానీకానికి కూడా సహాయ సహకారలు అందించాలని ప్రస్తుతం నా వంతు సాయంగా జెసిబి లు టాక్టర్స్ మొదలగు సదుపాయాలు అందిస్తున్నాను మన పార్టీ తరపున మీరందరూ కూడా సహకరించాలని కోరారు.

## పశువులకు ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు....



అమలాపురం అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పశువులకు ఏ విధమైన ప్రాణ నష్టం జరగకుండా పశు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్ విజయ్ రెడ్డి సూచించారు. సోమవారం ఆయన అమలాపురం నియోజకవర్గ పరిధిలో పర్యటించి పశువుల రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

# తాత పేరు నిలబెట్టాలి..

- ఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కుమారుడి బారసాల
- వేడుకకు కుటుంబంతో హాజరైన ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు
- చిన్నారికి 'శివాన్ ఎర్రన్నాయుడు'గా నామకరణం
- తాత ఎర్రన్నాయుడి పేరు కలిసివచ్చేలా పేరు ఖరారు
- తండ్రికి మించిన తనయుడిగా ఎదగాలని ఆకాంక్ష
- చిన్నారిని మనసారా ఆశీర్వదించిన అచ్చెన్నాయుడు



న్యూఢిల్లీ అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇంట పండుగ వాతావరణం నెలకొంది. ఆయన కుమారుడి నామకరణ మహోత్సవం ఆదివారం ఢిల్లీలో కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ఏపీ మంత్రి, రామ్మోహన్ నాయుడికి బాబాయ్ అయిన కింజరాపు అచ్చెన్నాయుడు తన కుటుంబంతో సహా హాజరయ్యారు. చిన్నారికి 'శివాన్ ఎర్రన్నాయుడు' అని నామకరణం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు తన ఆనందాన్ని పంచుకున్నారు. చిన్నారిని మనస్ఫూర్తిగా ఆశీర్వదించినట్లు తెలిపారు. "ఢిల్లీ గడ్డ మీద మారుమోగిన కింజరాపు వారి ఇంటి పేరుని నిలబెట్టి, తాతకు తగ్గ మనవడిగా, తండ్రికి మించిన తనయుడిగా శివాన్ ఎదగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను" అని ఆయన అన్నారు. దివంగత నేత, తన అన్నయ్య అయిన ఎర్రన్నాయుడి పేరు కలిసివచ్చేలా మనవడికి పేరు పెట్టడం సంతోషంగా ఉందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. చిన్నారి శివాన్ ఎర్రన్నాయుడికి అష్టైశ్వర్యాలతో, పరిపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు ప్రసాదించాలని కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు.

### ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పిలుపు మేరకు తుపాను సమయంలో సేవలందించేందుకు స్వచ్ఛందంగా

## వాలంటీర్ల సేవలు అందించుందుకు ముందుకొచ్చిన యువత




అమలాపురం అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)


ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు పిలుపుమారకు ఈ తుఫాను ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుందని అందుకు గ్రామస్తుల సహకరించాలని ఆయన కోరడం జరిగింది గ్రామంలో ఎమ్మెల్యే గారి ఆదేశించిన ఆదేశం మేరకు ఈ రోజున యువత అందరూ ముందుకు వచ్చి స్వచ్ఛందంగా మేము వాలంటరీ గా ఉంటామని ముందుకు వచ్చినారు ఈరోజు పంచాయతీ సెక్రెటరీ గోవిందరావు గారి ఆధ్వర్యంలో గ్రామాలలో తిరగడం జరిగింది ప్రతి వీధికి ప్రతి పేటకు వెళ్లి పూరి గుడిసిన వాళ్ళందరికీ కూడా మీరందరూ అక్కడ ప్రభుత్వ ఏర్పాటు చేసిన భవనాలకు మీరందరూ రావాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పంచాయతి సెక్రటరీ గోవిందరావు గారు మరియు సచివాల సిబ్బంది ముఖ్యంగా కూటమి యువ కార్యకర్తలందరూ పాల్గొనడం జరిగింది సత్తి చిన్న మాగాపు శ్రీను ఉండ్రు సామెల్ అయితా బత్తుల మేర కుమార్ చీకట్ల శ్రీను మన్నే వాసు పలుప్రోలు వర్మ అయితా బత్తుల ప్రవీణ్ అడబాల యేసు పివి వెంకటేష్ చీకట్ల కన్నా అంగాని దుర్గాప్రసాద్ పోసరాజు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఉలిశెట్టి సోమనాయుడు అన్వేష్ నాగు తదితరి యువత అందరూ పాల్గొనడం జరిగింది





## కొండల అంచు నుంచి వెలిగిన ఉదయం.. ఆకాశానికొద్దీ రంగుల కాంతుల పండుగ!





చింతపల్లి, అక్టోబర్ 27 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):

చింతపల్లి మండల పరిసరాల్లో సోమవారం తెల్లవారుజామున సూర్యోదయం అద్భుత దృశ్యం కనువిందు చేసింది. కొండల వెనకనుంచి వెలుగునిచ్చిన సూర్యుడు ప్రకృతిని మేల్కొలుపుతూ ఎర్రటి కాంతుల తోరణం విప్పాడు. పొగమంచు తొలగుతూ చెట్ల ఆడల మధ్యుగా జారిన కిరణాలు పచ్చదనంపై పడి వజ్రాల్లా మెరిపించాయి. మధ్యాహ్నానికి ఆకాశంలో మబ్బులు కమ్ముకొని కొండ శిఖరాల్లో నీలి మబ్బుల నాట్యం సాగింది. పచ్చటి అరణ్యంతో నిండిన ఈ కొండప్రాంతాల అందాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేశాయి. ఉత్సాహంగా వచ్చిన సందర్శకులు ప్రతి క్షణాన్ని చిత్రాల్లో బంధించేందుకు పోటీ పడ్డారు. పచ్చని పర్వతాలు, పొదల మధ్య విస్తరించిన ప్రకృతి వైభవం...ప్రాతఃకాల నడకకు వచ్చిన వయోవృద్ధులు కూడా ఈ దృశ్యాలను ఆస్వాదించి ఆనందం వ్యక్తం చేశారు. పక్షుల చిలకరావాలు, సేద తీరే గాలి, కాంతుల కిరణాలు కలిసి ఆహ్లాదభరిత వాతావరణాన్ని తీసుకొచ్చాయి. పర్యావరణ వేత్తలు మాట్లాడుతూ, అడవులను సంరక్షిస్తే ఇలాంటి అందాలు తర తరాలకు అందుబాటులో ఉంటాయని సూచించారు. సూర్యోదయం ప్రతి రోజూ కొత్త ఆరంభాలకు, కొత్త అవకాశాలకు సంకేతమన్నారు.

ఎండ్

### సోమలింగేశ్వరుడి సన్నిధిలో

## కిటకిటలాడిన భక్తులు

### అంతర్ల సోమలింగేశ్వరుడి దర్శనానికి భక్తుల తాకిడి.



చింతపల్లి, అక్టోబర్ 27 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి)


: కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా అంతర్ల సోమలింగేశ్వర శివాలయం భక్తులతో కళకళలాడింది. తెల్లవారుజాము నుంచే కుటుంబాల సమక్షంలో భక్తులు ఆలయానికి తరలివచ్చి దైవ దర్శనం చేశారు. శివలింగానికి పసుపు, కుంకుమలు సమర్పించి పవిత్ర స్నానం అనంతరం పాలు, పెరుగు, తేనె, గంగాజలంతో అభిషేకాలు నిర్వహించారు. పురోహితుడు జగన్ వేదఘోషల మధ్య రుద్రాభిషేకం, మహానైవేద్యాలు చేపట్టగా, మహిళలు కొబ్బరికాయలు పగులగొట్టి, కార్తీక దీపాలు వెలిగించి ఆలయ ప్రాంగణాన్ని నిత్య జ్యోతులతో అలంకరించారు. శివనామ స్మరణతో ప్రదక్షిణలు చేస్తూ, కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం కలగాలని భక్తులు ప్రార్థించారు. సాయంత్రం రుద్రత్రిశతి పారాయణం, లింగాస్తకం, శివతాండవ స్తోత్రాల నాదంతో ఆలయం సర్వత్ర భక్తి భావాన్ని చోరగొట్టింది. సోమలింగేశ్వర దర్శనంతో విఘ్నాలు తొలగి, కృప కటాక్షం ప్రసాదిస్తారనే విశ్వాసంతో భక్తులు తరలివచ్చారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని ఆలయ పురోహితులు నీటి, విద్యుత్, క్యూ లైన్ వంటి ఏర్పాట్లు సక్రమంగా చేశారు. స్థానిక గిరిజన సమాజ భక్తులు ప్రత్యేక నైవేద్యాలు సమర్పించడం విశేషం. పిల్లల నుంచి వృద్ధుల వరకు పెద్ద సంఖ్యలో భక్తులు హర్షోల్లాసాలతో పాల్గొన్నారు.

## ఆయుధాల వినియోగం తెలుసుకోవాలి

### విద్యార్థుల్లో భద్రతా చైతన్యంపై అవగాహన పెంపు.

### చింతపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు.

చింతపల్లి, అక్టోబర్ 26 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి)





: సమాజంలో శాంతి భద్రతలు నిలుపుదలలో యువత పాత్ర కీలకమని చింతపల్లి సిఐ ఎం. వినోద్ బాబు అన్నారు. విద్యార్థుల్లో భద్రతా చైతన్యం పెంపునకు ఆయుధాలపై కనీస అవగాహన అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. సోమవారం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలురు)-1లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తుపాకుల నిర్మాణ విధానం, ఉపయోగించే సందర్భాలు, ఆపరేషన్ టెక్నిక్స్, ప్రమాద నివారణ మార్గాలు వంటి అంశాలపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. అవసరం ఉన్న సందర్భాలలో మాత్రమే ఆయుధాలు వినియోగించే అధికారం పోలీస్ మరియు రక్షణ విభాగాలకేనని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయుధాలను అనధికారికంగా చేతబట్టరాదని విద్యార్థులకు హెచ్చరికలతో పాటు చట్టపరమైన సమాచారాన్ని అందించారు. పట్టణంలో శాంతి భద్రతల నిర్వహణలో పోలీస్ పోషిస్తున్న పాత్రను వివరించారు. అదేవిధంగా మొంథా తుఫాను ప్రభావం దృష్ట్యా నేడు, రేపు అవసరం లేకుండా బయటకు తిరగకూడదని, భద్రతా సూచనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వెంకటేశ్వరరావు, వెంకటరమణ, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెదిరేశ్వరం, కొమరాజులంకలో పేకాట దాడులు : 18 మంది అరెస్ట్

**రూ.27,720 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం౦ రావులపాలెం సీఐ శేఖర్‌బాబు నాయకత్వంలో చర్య**

రావులపాలెం, అక్టోబర్ 27 ( తెలుగు రాష్ట్రం ):

అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని రావులపాలెం మండలం వెదిరేశ్వరం, కొమరాజులంక గ్రామాల్లో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై పోలీసులు సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా రావులపాలెం సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ జి. చంటి, సిబ్బంది కలిసి ఈ దాడులు చేపట్టారు. దాడుల్లో వెదిరేశ్వరం గ్రామంలో పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్టు




చేసి, వారి వద్ద నుంచి రూ.25,370 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా కొమరాజులంక గ్రామంలో 8 మందిని అరెస్టు చేసి రూ.2,350 నగదు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 18 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ శేఖర్‌బాబు రావులపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరుచేసి వివరాలు వెల్లడించారు. పేకాట శిబిరాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# కర్నూలు బస్సు ప్రమాదం ప్రభుత్వం హత్యే : చిర్ల జగ్గిరెడ్డి

- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్
- 289 బస్సులపై కేసులు౦ "చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం" ప్రభుత్వం తీరు




**రావులపాలెం, అక్టోబర్ 27 ( తెలుగు రాష్ట్రం )**

ఇటీవల కర్నూలు సమీపంలో హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ బస్సు మంటలపాలై 19 మంది దుర్మరణం పాలైన ఘటనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల్లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాలెం గ్రామానికి చెందిన కొవ్వూరి శ్రీనివాసరెడ్డి కూడా ఉన్నారు. ఆయన హైదరాబాదులో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తుండగా బెంగళూరు ప్రయాణంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. జగ్గిరెడ్డి ఆదివారం రావులపాలెంలో శ్రీనివాసరెడ్డి గారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ౦ "ఇది ముమ్మాటికి ప్రభుత్వ వైఫల్యం, ప్రభుత్వం హత్యే" అన్నారు. ప్రభుత్వం ఐదు లక్షల పరిహారంతో బాధ్యతలు తప్పించుకోవడం సరికాదని, ప్రతి మృతుడి కుటుంబానికి కనీసం రూ.25 లక్షలు చొప్పున ఇవ్వాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

**289 బస్సులపై కేసులు %-% ప్రభుత్వం నిర్లక్ష్యం**

రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ మనీశ్ కుమార్ సిన్హా ఆదేశాల మేర ఒక్కరోజు తనిఖీలు జరిపి 289 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారని చెప్పారు. "ఇది ప్రభుత్వం నిర్లక్ష్యం ౦ చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం లాంటి తీరు" అని జగ్గిరెడ్డి విమర్శించారు. ఆ తనిఖీల్లో అగ్నిమాపక పరికరాలు లేని బస్సులు 103 రవాణా చట్టాలను ఉల్లంఘిస్తున్నవి 18
అత్యవసర ద్వారం లేని బస్సులు– 13, సరైన పత్రాలు లేని బస్సులు – 127 ఉన్నాయని 'ఆంధ్రజ్యోతి' పత్రికలోనే ప్రచురితమైందని గుర్తుచేశారు.

**ప్రజల ప్రాణాలతో ఆట**

ప్రతి ఆరు నెలలకు ఒకసారి జరగవలసిన రోడ్డు భద్రతా సమావేశాలు ప్రభుత్వం నిర్వహించడం లేదని, అధికారులు ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలతో చేతులు కలిపి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని జగ్గిరెడ్డి మండిపడ్డారు. అంతేకాదు, రాత్రి ఆలస్యంగా బెల్ట్ షాపులు నడపడం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు పెరుగుతోందని అన్నారు. "ప్రమాదం జరిగాక కాకుండా, జరగకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలి. అలా చేస్తే ఇలాంటి విషాద ఘటనలు నివారించవచ్చు" అని జగ్గిరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## తుఫాన్ అప్రమత్త ప్రచారంలో ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయుడు

**విద్యలోనే కాదు౦ సేవలోనూ ముందున్న ఆవిడి మోడల్ స్కూల్ టీచర్ దుర్గాప్రసాద్**



**కొత్తపేట, అక్టోబర్ 27 ( తెలుగు రాష్ట్రం ):**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం ఆవిడి మోడల్ ప్రైమరీ స్కూల్ టీచర్ ఆలేటి దుర్గాప్రసాద్ తుఫాన్ సమయంలో తన సేవా మనసుతో అందరినీ ఆకట్టుకుంటున్నారు. తుఫాన్ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో, ఇంట్లో విశ్రాంతి తీసుకోవాల్సిన సమయాన్ని ఆయన ప్రజలకు ఉపయోగపడేలా మలుచుకున్నారు. తన గ్రామంలో మైకుల ద్వారా తిరుగుతూ తుఫాన్ పరిస్థితులపై ప్రజలను అప్రమత్తం చేస్తూ, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచనలు ఇస్తున్నారు. "విద్యార్థులు మాత్రమే కాదు, ఊరి ప్రజలందరూ క్షేమంగా ఉండాలి" అనే సంకల్పంతో పని చేస్తున్న ఆయన తపన గ్రామస్థుల ప్రశంసలు అందుకుంది. తుఫాన్ సమయంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలంటూ ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ సూచనలను ఇంటింటికీ చేరుస్తున్నారు. ఇటీవలే ఉపాధ్యాయ వృత్తిలో చేసిన విశిష్ట సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం నుంచి 'ఉత్తమ ఉపాధ్యాయుడు' అవార్డు అందుకున్న ఆలేటి దుర్గాప్రసాద్, ఇప్పుడు తన సేవాభావంతో మరొకసారి ఆదర్శంగా నిలిచారు.

## అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్**

**అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సమాచారమివ్వాలని పిలుపు**



**కొత్తపేట, అక్టోబర్ 27 ( తెలుగు రాష్ట్రం ):**

మెంధా తుఫాన్ నేపథ్యంలో కొత్తపేట నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ సూచించారు. తుఫాన్ సమయంలో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావొద్దని ఆయన కోరారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే స్థానిక అధికారులకు లేదా కూటమి నాయకులకు సమాచారం ఇవ్వాలని శ్రీనివాస్ అన్నారు. విపత్కర పరిస్థితుల్లో జనసైనికులు, వీర మహిళలు, పార్టీ కార్యకర్తలు అందరూ సహాయక చర్యల్లో పాల్గొని ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు సహాయం కోసం కొత్తపేట రెవెన్యూ డివిజన్ కంట్రోల్ రూమ్ నంబర్లు౦ 08855-244299, 85002-38258 ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

## తుఫాన్‌పై అందరూ అప్రమత్తంగా ఉండాలి

**ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

**ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచన**
**రెవెన్యూ, పి.ఆర్., పోలీస్, ఎలక్ట్రికల్ అధికారులతో కాన్ఫరెన్స్ కాల్**



**కొత్తపేట, అక్టోబర్ 27 ( తెలుగు రాష్ట్రం):**

మొంథా తుఫాన్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తీరం దాటనున్న నేపథ్యంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, ఎలక్ట్రికల్ మరియు ఇతర విభాగాల ఉన్నతాధికారులతో కాన్ఫరెన్స్ కాల్ ద్వారా సమీక్ష నిర్వహించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో మరియు దాటిన తరువాత అత్యంత వేగంగా గాలులు వీయవచ్చని, అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశముందని ఎమ్మెల్యే అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు సురక్షిత ప్రదేశాల్లో ఉండేలా చూడాలని, అత్యవసర పరిస్థితులు తప్ప ఎవరూ బయటకు వెళ్లరాదని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, గుడిసెలు లేదా పాత శిథిల భవనాల్లో ఉన్న వారు వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఆహారం, వైద్యసేవలు వంటి అత్యవసర సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి తుఫాన్ పరిస్థితిని సమీక్షించి ప్రజలకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. "ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రానున్న రెండు రోజులు అత్యంత కీలకమైనవని గుర్తించి సమిష్టిగా కృషి చేసి ప్రజలను రక్షించాలి" అని బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు.

## తుఫాన్ పరిస్థితులను సంఘటితంగా ఎదుర్కొందాం

**కంఠంశెట్టి శ్రీనివాసరావు**

**ప్రజలతో పాటు కార్యకర్తలు కూడా సహాయక చర్యల్లో పాల్గొనాలి**



**కొత్తపేట, అక్టోబర్ 27 ( తెలుగు రాష్ట్రం):**

రాబోయే మెంథా తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు తోడు ప్రజలు కూడా సన్నద్ధంగా ఉండాలని కొత్తపేట టిడిపి సీనియర్ నాయకులు, ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ కంఠంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, తమ కుటుంబ సభ్యులు, పశువులు, ఆస్తులను రక్షించుకోవాలని ఆయన సూచించారు. స్థానిక శాసనసభ్యులు బండారు సత్యానందరావు పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, భాజపా నాయకులు, కార్యకర్తలు అందరూ ఒక తాటిపైకి వచ్చి విపత్కర పరిస్థితుల్లో సహాయక చర్యల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. "విపత్తు సమయంలో కూటమి నాయకులు అందరూ ప్రజల ప్రాణాలు ముఖ్యం అనే దృక్కోణంతో ముందుకు సాగాలి. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ అవసరమైన సహాయం అందించేందుకు టిడిపి జెఎస్పి బిజెపి కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు" అని శ్రీనివాసరావు తెలిపారు.

## మత్సా నాగేశ్వరరావు పార్థివ దేహానికి నివాళు లర్పించిన వైసీపీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి



**రావులపాలెం, అక్టోబర్ 27 ( తెలుగు రాష్ట్రం ):**

రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ మత్సా నాగేశ్వరరావు మృతిచెందడం పట్ల తీవ్ర విచారం వ్యక్తమైంది. ఆదివారం ఆయన పార్థివ దేహానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ ౦ "మత్సా నాగేశ్వరరావు పార్టీకి అహర్నిశలు కృషి చేసిన సీనియర్ నాయకుడు. ఆయన సేవలు మరువలేనివి. ఊబలంక గ్రామ అభివృద్ధికి చేసిన కృషి విశేషం. ఆయన మరణం పార్టీకి తీరని లోటు" అని అన్నారు. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన జగ్గిరెడ్డి , "భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు.

## వానపల్లిలో తుఫాన్ సన్నద్ధత చర్యలు

**సర్పంచ్ పల్లి భీమారావు పర్యవేక్షణ**

**పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు, గర్భిణీలు%-%వృద్ధులపై ప్రత్యేక దృష్టి**






**కొత్తపేట, అక్టోబర్ 27 ( తెలుగు రాష్ట్రం ):**

మెంత తుఫాన్ ప్రభావంతో అంబేద్కర్ కోనసీమ జిల్లా వానపల్లి గ్రామంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. గ్రామ సర్పంచ్ పల్లి భీమారావు పర్యవేక్షణలో అధికారులు పునరావాస చర్యలు చేపట్టారు. శాసనసభ్యులు బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు తుఫాన్ సమయంలో ప్రమాదం తలెత్తకుండా గ్రామంలోని పెంకుటీలలో నివసిస్తున్న కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించే పనిని స్వయంగా పల్లె భీమారావు పర్యవేక్షించారు. ప్రజలతో కలసి ఇంటింటికీ తిరిగి వారిని అప్రమత్తం చేశారు.ప్రజలకు ధైర్యం చెబుతూ, తమ భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఉండాలని సూచించారు. గ్రామంలో ఉన్న ఆవులు, గేదెలు వంటి పశువులను కూడా సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు.అలాగే గర్భిణీ స్త్రీలు, అనారోగ్యంతో ఉన్న వృద్ధులు ముందుగానే వానపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి వైద్య సేవలు పొందాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గ్రామ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సర్పంచ్ పల్లి భీమారావు మాట్లాడుతూ ౦ "ప్రతి ఒక్కరి ప్రాణం, ఆస్తి సురక్షితంగా ఉండేలా తుఫాన్ సన్నద్ధత చర్యలను సమగ్రంగా చేపట్టాం" అని తెలిపారు.

## ఆలమూరులో తుఫాను సహాయక చర్యలు ప్రారంభం

**పునరావాస కేంద్రాలు ఏర్పాటు - ప్రతి గ్రామంలో హెల్ప్‌లైన్ సెంటర్లు**



**ఆలమూరు, అక్టోబర్ 27 ( తెలుగు రాష్ట్రం ):**

మొంథా తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆలమూరు మండలంలో విస్తృతమైన సహాయక చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని పలు గ్రామాలను పర్యటించి అక్కడి పరిస్థితులను స్వయంగా సమీక్షించారు. ఎంపీడీవో మాట్లాడుతూ "మండల పరిధిలో ఆలమూరు గర్ల్స్ హై స్కూల్, బీసీ హాస్టల్, కాపు కళ్యాణ మండపం, బడుగువాలంక యూపీ స్కూల్, చెముడులంక శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపం వంటి ప్రదేశాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశాము. శిథిలమైన ఇళ్లు, రేకుల షెడ్లు, తాటాకు ఇళ్లలో నివసిస్తున్న వారిని ముందస్తు జాగ్రత్తగా ఈ కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేశాము" అని వివరించారు. ప్రతి గ్రామంలో 24 గంటల హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేసి, ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. తుఫాన్ గాలుల తీవ్రత కారణంగా ప్రమాదం కలిగించే ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడిన సందర్భంలో తాగునీటి సమస్య తలెత్తకుండా వాటర్ ట్యాంకుల వద్ద జనరేటర్లు సిద్ధంగా ఉంచినట్లు రాజు వివరించారు. తుఫాన్ తీవ్రతపై ప్రతి గ్రామంలో దండోరాలు, మైకుల ద్వారా ప్రజలకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ పర్యటనలో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీ ప్రత్యూష, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న దర్శనానికి పాదయాత్రగా 250 మంది భక్తులు

**నెలమూరు, పరిసర గ్రామాల నుంచి భక్తి మయంగా సాగిన యాత్ర**





**ఆత్రేయపురం అక్టోబర్ 27 ( తెలుగు రాష్ట్రం ):**

పశ్చిమ గోదావరి జిల్లా నవుడూరు సమీపంలోని నెలమూరు, పరిసర గ్రామాల నుంచి వచ్చిన సుమారు 250మంది భక్తులు కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని సోమవారం పాదయాత్రగా వచ్చి దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు భక్తులు మహా పాదయాత్రగా బయలుదేరి, గోవింద నామస్మరణలతో, భక్తిగీతాలతో మారుమోగుతూ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు వాడపల్లి చేరుకున్నారు. యాత్ర అంతా భక్తి మయ వాతావరణంలో కొనసాగిందని పాల్గొన్న భక్తులు తెలిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు ఆనందభరితులయ్యారు. ఆలయ అధికారులు చేసిన సత్కార ఏర్పాట్లు, తాగునీరు, భోజన వసతులను భక్తులు ప్రశంసించారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు పాదయాత్ర భక్తులను స్వాగతించి, వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది, భక్తసమితి సభ్యులు యాత్రికుల సేవలో పాల్గొన్నారు.

## కర్నూలు బస్ దుర్ఘటనను వైసీపీ రాజకీయ రంగు పులుముతోంది౦ ముత్యాల బాబ్జి

**ప్రభుత్వంపై విమర్శలు దిగజారుడు రాజకీయాల సంకేతం**



**కొత్తపేట, అక్టోబర్ 27 ( తెలుగు రాష్ట్రం ):**

హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ బస్సు కర్నూలు సమీపంలో జరిగిన ప్రమాదంపై వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ ప్రయోజనాల కోసమేనని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ ౦ ప్రమాదం జరిగిన బస్సుకు ఒడిశా రాష్ట్రంలో అనుమతులు లభించాయి, బయలుదేరింది తెలంగాణ రాష్ట్రం నుంచి, గమ్యస్థానం కర్ణాటక అని వివరించారు. "ఇది ముమ్మాటికి డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల జరిగిన ప్రమాదం. దురదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో మన ప్రాంతానికి చెందిన రావులపాలెం గ్రామస్తుడు కొవ్వూరి శ్రీనివాస్ రెడ్డి ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం," అని తెలిపారు. బాధిత కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే వైసీపీ నేతలు ఈ ఘటనను రాజకీయంగా వాడుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. "ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.5 లక్షలు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు, ఇది ప్రభుత్వ హత్య అని విమర్శించడం ౦ వైసీపీ నేతల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం" అని ముత్యాల బాబ్జి మండిపడ్డారు. ఇటువంటి ప్రమాదాలు మరల జరగకుండా రాష్ట్రవ్యాప్తంగా అధికారులు భారీ స్థాయిలో తనిఖీలు చేపట్టి 289 బస్సులపై కేసులు నమోదు చేయడం సరైన చర్య అని అభిప్రాయపడ్డారు. "అగ్నిమాపక పరికరాలు లేని బస్సులు, రవాణా చట్టాలను ఉల్లంఘిస్తున్న బస్సులు, అత్యవసర ద్వారం లేని బస్సులు, సరైన పత్రాలు లేని బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతి ఆరు నెలలకోసారి రోడ్డు భద్రతా సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని" ఆయన డిమాండ్ చేశారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక
ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
అమలాపురం అక్టోబర్ 28, మంగళవారం 2025


## మంథా తుఫాన్ ప్రభావంతో అధికారులు అప్రమత్తం

### పునరావాస కేంద్రాల పరిశీలన



**కొత్తపేట అక్టోబర్ 27( తెలుగు రాష్ట్రం )**
"మంథా" తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులు, భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కొత్తపేట రెవెన్యూ డివిజినల్ అధికారి సోమవారం వానపల్లి గ్రామం, సంఘం పాలెం వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఆర్‌డిఓ నిర్వాసితులతో మాట్లాడి వారికి స్థైర్యం కల్పించారు. పునరావాస కేంద్రంలో ఉన్న సదుపాయాలను సమీక్షించి, పర్యవేక్షణ అధికారులకు, సిబ్బందికి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలంటూ సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కొత్తపేట, ఎంపీడీవో, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## కొల్లి రాజశేఖర్ కు ఘన సత్కారం



**తాడేపల్లిగూడెం, అక్టోబర్27 (తెలుగురాష్ట్రం విలేకరి):**
మండలంలోని కొండ్రుపాలు గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు పెనుమాక సుబ్బారావు ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడైన కొల్లి రాజశేఖర్ ను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొండెల్లి శివ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి లంక రాజశేఖర్, కండెల్లి రాజేష్ , గాలింకి వెంకటాచలం, ఉంగుటూరు నియోజకవర్గం ఇంచార్జ్ సీతారామరాజు, గాలింకి ప్రేమ్ కుమార్, నేకూరి భాను, నూతంగి అచ్చిబాబు, అప్పారావు, శనమండ్ర సురేష్, అయినపర్తి వెంకటేశ్వరరావు, సీలి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## కంట్రోల్ రూమ్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలి

### -ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్



**రంపచోడవరం,అక్టోబర్ 27(తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
తుపానుకు సంబంధించిన కంట్రోల్ రూమ్ సిబ్బంది ఎప్పటికప్పుడు తుఫాను తగ్గేవరకు అందుబాటులో ఉండాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ హెల్త్ మానిటరింగ్ సెల్ హాల్లో ఏర్పాటు చేసిన తుపాను కంట్రోల్ రూమ్ను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో తుఫాను తగ్గేవరకు కంట్రోల్ రూమ్ లో ఉన్న అధికారులు సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి తుపానుకు సంబంధించిన సమస్యలు తెలుసుకొని నివేదికలు సమర్పించాలని ఆయన అన్నారు. ఏడు మండలాల నుండి ఏ టైంలో నైనా తుఫాను బాధితులు కంట్రోల్ రూమ్ కు తెలియపరిచిన యెడల వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టే విధంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. తుఫాన్ కంట్రోల్ రూమ్ను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని ఏపీఓ జనరల్ డివిన్వి రమణను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. ఈ కంట్రోల్ రూమ్ కి సంబంధించిన సిబ్బందికి ఏమైనా సమస్యలున్నా యెడల మా దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. ప్రాజెక్ట్ అధికారి వెంట డిప్యూటీ తహసిల్దార్ పియాజ్ భాష(జిలాని), బి.మార్గదర్శి, పి.లక్ష్మిరెడ్డి, నాగేంద్ర, కంట్రోల్ రూమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### తుఫాన్ ప్రత్యేక అధికారి అరుణ బాబు



**నాయుడుపేట, అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
మొంథా తుఫాన్ పట్ల నిర్లక్ష్యం వహించకుండా అధికారులు, సిబ్బంది మరో మూడు రోజులు పాటు అప్రమత్తంగా ఉండాలని తుఫాన్ ప్రత్యేక అధికారి అరుణబాబు సూచించారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎటువంటి ఇబ్బంది కలిగినా తహసిల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్లను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. సోమవారం నాయుడుపేట తహసిల్దార్ కార్యాలయంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, నాయుడుపేట తహసిల్దార్ ఎం. రాజేంద్ర, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, సీఐ బాబి లతోపాటు రెవిన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే 3 రోజులు వర్షాలు ఎక్కువగా వస్తాయని తెలిపారు. వర్షాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఇండ్లలోను, కూలిపోయే చెట్ల కింద ఉండొద్దని, విద్యుత్ స్థంబాల చెంతకు వెళ్లొద్దని ప్రజలకు సూచించారు. ప్రజలందరూ వీలైనంత వరకు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని తెలిపారు. నీరు నిలిచే ప్రాంతాలకు, అండర్ బ్రిడ్జిలు వద్దకు వెళ్ళవద్దని తెలిపారు. పడిపోయే చెట్లు, కూలిపోయే భవనాలు ఉంటే అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో నీరు, ఆహారం, వసతి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది అందించే సూచనలు, సలహాలు పాటించి సురక్షితంగా ఉండాలని తెలిపారు.

## రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలను తాడేపల్లిగూడెంలో నిర్వహించటం అభినందనీయం

### -జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్



**తాడేపల్లిగూడెం, అక్టోబర్27 (తెలుగురాష్ట్రం విలేకరి):**
ఆంధ్ర చెస్ అసోసియేషన్, మాస్టర్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 2న స్థానిక గుణం వేణుగోపాల్ ఫంక్షన్ హాలులో ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని స్థానిక క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు, జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలను నిర్వహించటం ఎంతో ఆనందదాయికమని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు రూ లక్ష రూపాయల నగదు బహుమతిని 25 మంది క్రీడాకారులకు అందజేయనున్నారని చెప్పారు. ఈ పోటీలకు స్పాన్సర్ గా వ్యహరిస్తున్న వాసవి క్లబ్ కి, ఈతకోట తాతాజీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తమ పాఠశాల లోటస్ తరఫున తన వంతు సహాయం అందజేస్తామని వివరించారు. మాస్టర్స్ చెస్ అకాడమీ కార్యదర్శి ఎస్. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఓపెన్ క్యాటగిరిలో మొదటి ఐదు స్థానాలు సాధించిన వారిని, అండర్ 7,9,11,13,15 బాయ్స్ అండ్ గర్ల్స్ విభాగాల్లో మొదటి రెండు స్థానాలు సాధించినవారిని నవంబర్లో విజయవాడలో నిర్వహించే ఆల్ ఇండియా బిలో 1800 రేటింగ్ టోర్నమెంట్ కి ఎంపిక చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. క్రీడాకారులకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఏపీ చెస్ డాట్ ఓఆర్జి వెబ్సైట్ లో రిజిస్టర్ చేసుకోవాలని మరిన్ని వివరాలకు 94408 67370 నంబర్ ను సంప్రదించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రెసిడెంట్ పసుమర్తి అనిల్, జనరల్ సెక్రెటరీ మండ పవన్, ట్రెజరర్ ముత్త శ్రీధర్ గుప్తా, రీజియన్ సెక్రెటరీ సీమకుర్తి రాజశేఖర్ గుప్తా, పాబోలు రాజగోపాలం, బ్లూ సిమ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ వై.డి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ కుంతీదేవి మహోత్సవాలు



**విఆర్ పురం, అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
విఆర్ పురం మండలంలోని రేఖపల్లి గ్రామ ఎస్సీ కాలనీ నందు ప్రతి మూడు సంవత్సరాల ఒకసారి శ్రీ కుంతీదేవి అమ్మవారి మహోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో, ప్రత్యేక పూజలతో, గణాకారుల నడుమ అంగరంగ వైభవంగా ఈ మహోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని గ్రామ పెద్దలు అన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ మహోత్సవాలు ప్రతి మూడు సంవత్సర కోసారి భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని, భక్తితో నందిన్నా మట్టి విగ్రహం తయారుచేసి ఆలయంలో కొలువుంచి పూజలు నిర్వహించి, సాయంత్రం వేళ సమయంలో గాణకారులతో, సన్నాయి వాయిద్యాల నడుమ జాతర జరుగుతుందని, సంతానం లేని దంపతులు ఆలయం వద్దకు వచ్చి, ప్రత్యేక భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, రాత్రి సమయంలో ఆ దంపతులు జాగారం చేసి అనంతరం సంతానాన్ని పొందుతారు. అలా పూర్వకాలం నుండి జరుగుతూ వస్తుందని పెద్దలు తెలియజేశారు. అంతేకాదు జాతర అనంతరం మట్టితో తయారు చేసిన నందిన్నా స్వామిని ఆఖరి రోజున చుట్టుపక్క గ్రామాలలో ఊరేగింపుగా తీసుకొని వెళ్లడం అనాధ కాలం నుండి వస్తున్న ఆచారం. ఈ విధముగా చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు నందిన్న స్వామి దర్శనం పొంది, స్వామివారి కృపకు పాత్రులవుతారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, చుట్టుపక్కల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

## ఘనంగా తాతాజీ పుట్టినరోజు వేడుకలు

### పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణి



**తాడేపల్లిగూడెం, అక్టోబర్27 (తెలుగురాష్ట్రం విలేకరి):**
భాజపా నియోజకవర్గం ఇంచార్జ్ ఈతకోట భీమ శంకరరావు (తాతాజీ) పుట్టినరోజు వేడుకలను స్థానిక కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బిజెపి జిల్లా మీడియా ఇంచార్జి నరిసే సోమేశ్వరరావు, దూలం శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను కేక్ కట్ చేసి షిరిడి లో ఉన్న తాతాజీకి ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా మీడియా ఇంచార్జి నరిసే సోమేశ్వర మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ గా, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షునిగా, ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షునిగా తాతాజీ సేవలందించారన్నారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారని,. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క%శీ%చుమర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ శత్రువునైనా స్నేహభావంతో కలుపుకొని పోయే నాయకుడు తాతాజీ అని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు ప్రసాద్ మాట్లాడుతూ అజాత శత్రువు, నిరంతర శ్రమజీవి ఈతకోట తాతాజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు కొండపల్లి నగేష్, పడమర సోసైటీ అధ్యక్షులు పసుపులేటి అమ్మి రాజు, పెంటపాడు మండల అధ్యక్షులు ఇమ్మ%శీ%ది శ్రీనివాస్, ఆత్మ నిర్భర్ భారత్ ఇన్చార్జి రామగాని సత్యనారాయణ, గూడెం పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు,గరగా ప్రసాద్, కార్యదర్శి తుమరాడ చిన్న, ఉపాధ్యక్షులు లచ్చిరెడ్డి సత్యనారాయణ, దొంతుకుర్తి శ్రీనివాస్, బిజెపి నాయకులు డాక్టర్ పృధ్వి, ఆరాధ్యుల అంజి,నీలం రమణ,పిన్నింటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**సేవకార్యక్రమాలు**

తాతాజీ పుట్టినరోజును పురస్కరించుకుని భాజపా నాయకులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక యాగర్లపల్లిలోని అనాధ ఆశ్రమంలో దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. అనంతరం పడాల వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## తుఫాన్ పట్ల ప్రజలు అధికారులకు సహకరించాలి

### -టిడిపి మండల అధ్యక్షుడు బొర్రా నరేష్



**వి ఆర్ పురం, అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
విఆర్ పురం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు మొంథా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని టిడిపి మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భయంకరమైన తుపాన్ ముంచుకోస్తున్న వేళ రాష్ట్ర వ్యాప్తంగా ప్రమాదం పొంచి ఉన్నదని, కావున మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి ప్రజలందరికి ముందస్తు జాగ్రత్తగా పలురకాల చర్యలు చేపట్టనున్నారని, ప్రజలందరూ ప్రభుత్వ సూచనలు పాటించి అధికారులకు సహకరించగలరని ఆయన మండల ప్రజలను కోరారు.

## అధికారులు సమన్వయంతో పని చేయాలి

### -శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్





**తాడేపల్లిగూడెం, ఆగస్టు 27 (తెలుగురాష్ట్రం విలేకరి):**
మెంథా తుఫాన్ నేపథ్యంలో మండలస్థాయి అధికారులు సమన్వయంతో పని చేయాలని, ఆస్తి, ప్రాణ నష్టాలు వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ స్థాయి అధికారులతో స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో రాబోయే రెండు రోజుల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన అతిభారీవర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, విద్యుత్ సౌకర్యాల పట్ల ఎల్లవేళలా అధికారులు పర్యవేక్షణ నిర్వహించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తాడేపల్లిగూడెం రెవిన్యూ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లను సంప్రదించేలా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఎవరిని ఉపేక్షించేది లేదని, వారిపై కఠినచర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

**నందమూరు అక్విడెక్టు పరిశీలన**

తాడేపల్లిగూడెం- నిడదవోలు మార్గంలోని నందమూరు గ్రామంలో ఎర్రకాలువపై నిర్మించిన అక్విడెక్టు వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలలోని రైతులు నష్టపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, కూటమి నాయకులు స్వచ్ఛందంగా ప్రజలందరినీ అప్రమత్తం చేయాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లో పర్యవేక్షణ నిర్వహిస్తూ రక్షణ చర్యలు తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు, ఇరిగేషన్ డిఈ, కె.ధర్మ జ్యోతి, ఎమ్మార్వో సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బరియల్ గ్రౌండ్ లో ముళ్ల పొదలను తొలగించిన టిడిపి అధ్యక్షులు రవి



**కూనవరం, అక్టోబర్27 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మేజర్ పంచాయతీలో ఉన్న బరియల్ గ్రౌండ్ వాటిక ముళ్లపదలతో నిండి దహన సంస్కారనలకు వెళ్లడానికి దారి లేక పంచాయతీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలుసుకున్న కూనవరం తెలుగుదేశం పార్టీ శాఖ అధ్యక్షులు హెచ్చు రవి జెసిబితో ముళ్లపదలన్నిటిని తొలగించారు. ఆ స్మశాన వాటికకు వెళ్లే రహదారిలో బురదతో నిండి అడుగు తీసే అడుగు వేయడానికి కూడా అధ్వానంగా ఉన్న ఆ రహదారి ప్రదేశాన్ని మొత్తం శుభ్రం చేయించారు. గ్రామంలో ఎవరైనా మరణించిన బరియల్ గ్రౌండ్ వాటికకు తీసుకెళ్లే క్రమంలో వారు పడుతున్న ఇబ్బందులు చూసి చలించిన అతను ఈ మహత్కార్యం చేసిన హెచ్చు రవిని పంచాయతీ ప్రజలు, వివిధ పార్టీల నాయకులు అభినందించారు

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం విలేకరి):**
మొంథా తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైయస్ఆర్‌సిపి రాష్ట్ర రైతు విభాగ (ఆక్వాకల్చర్) వర్కింగ్ ప్రసిడెంట్ వడ్డీ రఘురామ్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అవసరమైన ప్రాంతాలతో పాటు పునరావాస చర్యల్లో ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

# ఉపాధ్యాయుల నిర్లక్ష్యం నిండు ప్రాణం బలి

## సంవత్సరానికి ఒక విద్యార్థిని భీంపోలు ఆశ్రమ పాఠశాలలో బలి కావాల్సిందేనా!

## -విద్యార్థిని ప్రాణం ఖరీదు లక్ష నుండి నాలుగు లక్షలు

**అనంతగిరి, అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం విలేకరి):**



గిరిజన ప్రాంతంలో విద్యకు విద్యార్థులు కొంత మంది దూరం అవుతున్నారు. విద్యకు దగ్గరైతే ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వలన ప్రాణాలు పోతున్నాయి. నిర్లక్ష్యం కారణం ఉపాధ్యాయులు మాత్రమే కాదు.. విద్యాశాఖ అధికారులు కూడా.. గిరిజన ప్రాంతంలో ఉండే పాఠశాలలలో విద్యార్థుల మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ప్రభుత్వంపై, ఉపాధ్యాయులపై నమ్మకంతో పిల్లల్ని పాఠశాలలో జాయిన్ చేస్తే ఎంతో మంది విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిపేస్తున్నారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం భీంపోలు పంచాయతీ గ్రామంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడాదికొకరు ప్రాణం వదిలేస్తున్నారు. గుమ్మకోట పంచాయతీ గొట్టేలపాడు గ్రామానికి సంబంధించిన అమ్మాయి ఎన్నో రోజుల నుండి అనారోగ్యానికి గురయి ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వలన ప్రాణాలు వదిలేసింది. విద్యాశాఖ అధికారి, రాజకీయ నాయకులు కలిసి పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోకుండా విద్యార్థుల తల్లితండ్రులకు డబ్బులు ఇప్పించారు. ప్రస్తుతం భీంపోలు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న అమ్మాయి అనారోగ్యంతో మృతి చెందింది. సమిరెడ్డి అంజలి 12 సంవత్సరాలు చిడివలస గ్రామం కొత్తూరు పంచాయతీ, గడిచిన కొన్ని రోజుల నుండి



పాఠశాలలో అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం చాలా బాధాకరం. తల్లితండ్రులు ఎన్ని సార్లు పాఠశాల వద్దకు వచ్చి పిల్లని పంపించండని ప్రాధేయపడి అడిగినా, బ్రతిమలాడినా సరే పంపించకుండా, పాఠశాలలో ప్రాణం పోయే ముందు మమ్మల్ని రప్పించారు. మా అమ్మాయి మృతికి కారణం పాఠశాల సిబ్బందిని విద్యాశాఖ అధికారి, మండల నాయకుల ఎదుట మొరపెట్టుకున్నారు. కాని అంజలి ప్రాణాలను ఖరీదు కట్టి చెక్కు రూపంలో నాయకులు, అధికారులు కలిసి విద్యార్థుల తల్లితండ్రులకు అందించారు. ఉపాధ్యాయులపై విద్యాశాఖ అధికారులు ఏమి చర్యలు తీసుకున్నట్లు? విద్యార్థులకు ప్రభుత్వం, అధికారులు ఏమి మెసేజ్ ఇస్తున్నట్లు భావించాలి. పాఠశాలలో ప్రాణాలు పోతుంటే పాఠశాల యాజమాన్యంపై చర్యలు లేకుండా డబ్బులుకి సెటిల్మెంట్ లు చేస్తే బాగుంటుందని మెసేజ్ ఇస్తున్నారా.. అదే మన పిల్లలకి అలా జరిగితే ఇలా నే ఉంటామా ఆలోచించండి. అధికారులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు ఎక్కడ ఉన్నారు? ప్రభుత్వం దృష్టికి విద్యార్థుల మరణాలు తీసుకోని వెళ్లే ఆలోచన లేదేమో! విద్యా కమిటి చైర్మన్ ఉండి కూడా ఇలాంటి ఘటనలు జరుతున్నాయి. భీంపోలు గిరిజన బాలికల పాఠశాలలో జాయిన్ చేయాలంటే తల్లితండ్రులు భయపడుతున్నారు. నాయకులు, అధికారులు పాఠశాల సిబ్బందిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాలి..

## తుఫాన్ పట్ల అధికారులు ప్రజలు

# అప్రమత్తంగా ఉండాలి..

### జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్





**నర్సాపురం, అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సోమవారం నరసాపురం నియోజకవర్గం తీర ప్రాంత గ్రామాలు అయినా పెద్దమైన వానిలంక, వేముల దీవి, బియ్యపుతిప్ప, చిన్నమైనవానిలంక, పాతపాడు, కేపి పాలెం గ్రామాలలో జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి తుఫాన్ ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను స్వయంగా పరిశీలించి సంతృప్తిని వ్యక్తపరిచారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సముద్ర అలల ఉధృతిని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. పునరావాస కేంద్రాలకు తరలిరావాలని సూచించారు. పునరావాస కేంద్రాల లో ఏర్పాట్లను పరిశీలించారు. అవసరమైతే పరిస్థితిని బట్టి లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాలలో బాధితులకు భోజన వసతితో పాటు త్రాగునీరు, టాయిలెట్స్, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖలు సిబ్బంది ఎటువంటి విపత్తు సంభవించిన ఎదుర్కొనుటకు సంసిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చిన కంట్రోల్ రూమ్ కు సమాచారమును అందించాలని అన్నారు. అలాగే మత్స్యకారులు సముద్రంలోకి, ఉప్పుటేరులోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. తీరంలో అగ్నిమాపక, ఎన్ డి ఆర్ ఎఫ్ సిబ్బందిని సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. తీరందాటే సమయంలో భారీ వర్షాలతో పాటు వేగముగా గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు ఎవరు బయటకు రాకుండా అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో సురక్షితముగా ఉండాలని అన్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు నరసాపురం మండలం వేములదీవి పడమర చినమైన వానిలంక గ్రామంలో శిధిలావస్థలో ఉన్న నల్లి క్రీక్ వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంలో జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్ వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు, తహసిల్దారులు ఐతం సత్యనారాయణ, రాజ్ కిషోర్, కనకరాజు, ఎంఎస్ పాజిల్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## 28వ తేదీ రాత్రిలోగా

## మచిలీపట్టణం- కళింగపట్నం మధ్య

# తీరం దాటవచ్చు..



**ఏలూరు, అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

'మొంథా' పెను తుఫాన్ ఈనెల 28వ తేదీ రాత్రిలోగా మచిలీపట్టణం- కళింగపట్నం మధ్య తీరం దాటవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఆ సమయంలో తీవ్రమైన వేగంతో గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి మరియు తుఫాన్ పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్ దండే చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లో జిల్లా యంత్రాంగం తీసుకున్న తుఫాన్ ముందస్తు జాగ్రత్త చర్యలను పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ లతో కలిసి తెలియజేసారు. ఈ సందర్భంగా కాంతిలాల్ దండే మాట్లాడుతూ తుఫాన్ కారణంగా జిల్లాలో ఎటువంటి నష్టం కలగకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకున్నదన్నారు. ముంపు ప్రాంతాలలోని ప్రజలను తరలించేందుకు 82 తుఫాన్ సహాయక కేంద్రాలను గుర్తించడం జరిగిందని, వాటిలో కలిదిండి లో సహాయక కేంద్రాన్ని ఏర్పాటుచేసి 42 కుటుంబాలను తరలించడం జరిగిందన్నారు. జిల్లాలో 301 మైనర్ ఇరిగేషన్ చెరువులు సమస్యాత్మకమైనవిగా గుర్తించడం జరిగిందని, వాటిలో 129 మైనర్ ఇరిగేషన్ చెరువులు ప్రమాదకరమైనవిగా గుర్తించడం జరిగిందన్నారు. వీటి వద్ద సిబ్బందిని ఏర్పాటుచేసి, ప్రమాదానికి మించి నీటి ప్రవాహం వస్తే గండి కోట్లే చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందన్నారు. తుఫాన్ సమయంలో పెనుగాలులు వీచే అవకాశం ఉన్న దృష్ట్యా జిలాల్లో 763 హోర్డింగ్లు తొలగించడం జరిగిందన్నారు. తుఫాన్ ముంపు గ్రామాలలో 100 మంది గజఈతగాళ్లను సిద్ధం చేశామని, 123 మంది గర్భిణీలను దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. 11 లంక గ్రామంలో ప్రజలకు నిత్యావసర సరుకులు, ఆహార ధాన్యాలు అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. కల్వర్టులు, కాజ్ వే ల వద్ద రెవిన్యూ, పోలీస్ సిబ్బందిని పహారా ఉంచామన్నారు. తుఫాన్ సమయంలో చెట్లు కూలిపోయిన కారణంగా రవాణా వ్యవస్థకు ఎటువంటి ఇబ్బందిలేకుండా ఉండేలా చెట్లు తొలగించేందుకు చెట్లు కట్ చేసే యంత్రాలు, జెసిబి లు సిద్ధం చేయడం జరిగిందన్నారు. జిలాల్లో శిధిలావస్థలో ఉన్న భవనాలు, పూరిళ్లు 7279 గా గుర్తించడం జరిగిందని, వాటిలో ప్రజలను తుఫాన్ ప్రమాదం తగ్గే వరకు వారి బంధువుల ఇళ్లకు గాని, లేదా ప్రభుత్వం ఏర్పాటుచేసిన సహాయక కేంద్రాలకు రావలసిందిగా కోరడం జరిగిందన్నారు. ఉప్పుటేరు బ్యాక్ వాటర్ కారణంగా ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నదన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ 'మొంథా' పెను తుఫాన్ ప్రభావంతో మంగళవారం జిల్లాలోని 13 మండలంలో పెనుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని 14 మండలాల్లో హై అలెర్ట్ ప్రకటించడం జరిగిందన్నారు. తుఫాన్ సమయంలో గాలితీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో జిల్లాలోని 763 హోర్డింగ్స్ ను తొలగించడం జరిగిందన్నారు. తుఫాన్ సమయంలో ప్రజలెవ్వరూ నదులు, చెరువులు ఈతకు వెళ్లవద్దని, బయటకు రావద్దని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. తుఫాన్ సమయంలో దెబ్బతిన్న విద్యుత్ పనుల పునరుద్ధరణకు గాను 2 వేల విద్యుత్ స్థంబాలు, 500 ట్రాన్స్ఫార్మర్లు, 1200 మంది విద్యుత్ సిబ్బందిని అత్యవసర సేవల నిమిత్తం సిద్ధం చేయడం జరిగిందన్నారు. తుఫాన్ సహాయక చర్యలకు గాను 59 జేసీబీలు, 37 చెట్లు కట్ చేసే యంత్రాలతోపాటు ఎస్డీఆర్ఎఫ్ బృందం ను సిద్ధం చేయడం జరిగిందన్నారు. తుఫాన్ గాలి తీవ్రత, భారీ వర్షాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున తుఫాన్ సమయంలో అత్యవసరం అయితే తప్ప ప్రజలెవ్వరూ బయటకు రావద్దని, జిల్లా యంత్రాంగంతో సహకరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.

## "మొంథా తుపాను" సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు

# నూరు శాతం పటిష్టమైన ఏర్పాట్లు

**భీమవరం అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



"మొంథా తుపాను" సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం నూరు శాతం పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరిగింది. తుఫాన్ సమయంలో కమ్యూనికేషన్ వ్యవస్థ కీలకమైనదని, కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా ఉంటే నష్టాన్ని చాలా వరకు తగ్గించుకోవచ్చని .రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు కోస్తా జిల్లాల తుఫాన్ ప్రత్యేక పర్యవేక్షకులు ఆర్.పి సిసోడియా. తెలిపారు. "మొంథా తుపాను" నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లాలో తుఫాను ఏర్పాట్లుపై జిల్లా యంత్రాంగంతో సమీక్షించేందుకు సోమవారం భీమవరం కలెక్టరేట్ చేరుకున్న రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు కోస్తా జిల్లాల తుఫాన్ ప్రత్యేక పర్యవేక్షకులు ఆర్.పి సిసోడియా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి లతో సంయుక్తంగా సమీక్షించారు. అనంతరం భీమవరం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో పాల్గొని జిల్లాలో తుఫాన్ ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కునేందుకు చేపట్టిన చర్యలను ఆర్.పి సిసోడియా వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఆర్.పి సిసోడియా మాట్లాడుతూ మొంథా తుఫాన్ కాకినాడకు 500 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నదని, మంగళవారం రాత్రికి కాకినాడ మచిలీపట్నంల మధ్య తుఫాన్ తీరం దాటవచ్చు అన్నారు. తుఫాన్ సమయంలో కమ్యూనికేషన్ వ్యవస్థ చాలా కీలకమైనదని, కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా ఉంటే నష్టాన్ని చాలా వరకు తగ్గించుకోవచ్చు అన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. మొబైల్ టవర్ల వద్ద జనరేటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం తుఫాను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నూరు శాతం పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 16 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు, 26 పక్కా భవనాలను పునరావాస కేంద్రాల నిర్వహణకు సిద్ధం చేయడం జరిగింది, ఒక ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం నరసాపురంలో సిద్ధంగా ఉందన్నారు. 68 జేసీబీలు, 57 పవర్ సాసర్లు సిద్ధం చేయడం జరిగింద న్నారు. లోతట్టు ప్రాంతాలు, తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో నీటి తొలగింపు చర్యలను పక్కాగా నిర్వహించాలన్నారు. గర్భిణీ స్త్రీలను, వృద్ధులను స్థానిక పీహెచ్సీలకు తరలించడం జరిగిందన్నారు. తుఫాన్ తీవ్రతను బట్టి 90 నుండి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, డివైడర్ల మధ్యలో హోర్డింగ్స్ ను తొలగించాలని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రోడ్లమీద ప్రైవేట్ వెహికల్స్ తిరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కి ఆదేశాలు జారీ చేశారు. పత్రికా విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం పాల్గొన్నారు.

# ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

**అమలాపురం అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



వాతావరణ శాఖ హెచ్చరికల దృష్ట్యా మొంథా తూఫాన్ ప్రభావము ఉన్నందున ప్రజలందరూ జాగ్రత్తగా మరియు అప్రమత్తంగా ఉండాలని డీసిఎంఎస్ చైన్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి తెలిపారు. ఈ విపత్కర సమయములో ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిఎం నారా చంద్ర బాబు నాయుడు కూటమి నాయకులు ప్రభత్వ అధికారులుతో కలసి ఎప్పటికప్పుడు సమీక్ష లు జరిపి అటు ప్రభత్వ అధికారులను ఇటు కూటమి నాయకులు కూటమి కార్య కర్తలను ప్రజలకు అండగా ఉండి సహకరించ వలసినిధిగా కోరారుజ సిఎం సూచనల మేరకు కూటమి నాయకులు కూటమి కార్యకర్తలు ప్రజలు కు అండగా ఉండి సహకరించాలని కోరారు.

## ప్రమాదకరమైన శిథిల భవనాలలో ప్రజలను వెంటనే

# సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

### జిల్లాలో ఒక్క ప్రాణనష్టం కూడా సంభవించకూడదు

### అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సమీక్ష

**ఏలూరు, అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్న శిథిల భవనాలలో ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి సోమవారం తుఫాన్ పరిస్థితిపై జిల్లా అధికారులు,నియోజకవర్గ,మండల, ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ తో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ఒక్క ప్రాణ నష్టం జరగకుండా పటిష్టమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని, తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా శిధిలావస్థలో ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్న ఇళ్లలో ఉన్న ప్రజలను వెంటనే వారి బంధువుల ఇంటికి గాని, లేదా ప్రభుత్వం ఏర్పాటుచేసిన సహాయక శిబిరాలకు గాని తరలించాలన్నారు. తుఫాన్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్త చర్యలపై ప్రతీ గ్రామ/వార్డ్ సచివాలయాలు పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తుఫాన్ ప్రభావిత గ్రామాలలో తుఫాన్ సహాయక శిబిరాలు ఏర్పాటుచేసి, లోతట్టు ప్రాంతాల ప్రజలను వెంటనే సహాయక శిబిరాలకు తరలించాలన్నారు.

## మొంథా తుఫాన్ ప్రభావం

# మరింత తీవ్రం కానుంది

**అమలాపురం అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



మొంథా తుఫాన్ ప్రభావం మరింత తీవ్రం కానుందని కోనసీమ జిల్లా తుఫాన్ సహాయక చర్యల ప్రత్యేక అధికారి, విద్యాశాఖ సంచాలకులు వి. విజయరామరాజు తెలిపారు.సోమవారం కేసనపల్లి సైక్లోన్ సెంటర్లో ముంపు బాధితులను పరామర్శించిన ఆయన, వసతి, ఆహార వసతులు, వైద్య సేవలను పరిశీలించారు. మొంథా తుఫాన్ మంగళవారం తీవ్ర తుఫానుగా మారి రాత్రికి తీరాన్ని తాకే అవకాశం ఉందన్నారు. గంటకు 90 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు.ప్రజలు అశ్రద్ధగా ఉండకూడదని హెచ్చరిస్తూ, మంగళవారం సాయంత్రం నుంచి ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. తుఫాన్ నేపథ్యంలో 24 గంటల కంట్రోల్ రూములు, అత్యవసర సిబ్బంది సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మొబైల్ టవర్ల వద్ద జనరేటర్లు ఏర్పాటు చేయించి కమ్యూనికేషన్ వ్యవస్థ నిరంతరాయంగా కొనసాగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.ప్రత్యేక అధికారి విజయరామరాజు, జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్లు వైద్య శిబిరాన్ని సందర్శించి సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు కే. ప్రభాకర్, పి. కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి....

**ముందస్తు చర్యలుపై ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమీక్ష....**
**ఆస్తి,ప్రాణ నష్టాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచన....**
**రెవెన్యూ,పి ఆర్,పోలీస్,ఎలక్ట్రికల్ అధికారులతో కాన్ఫరెన్స్ కాల్ లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...**

**కొత్తపేట, అక్టోబర్ 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మొంథా తుఫాన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తీరం దాటనున్న నేపథ్యంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల రెవెన్యూ,పి ఆర్,పోలీస్,ఎలక్ట్రికల్ మరియు ఉన్నతాధికారులతో కాన్ఫరెన్స్ కాల్ లో మాట్లాడారు. తుఫాను తీరం దాటే సమయంలో,దాటిన తర్వాత అత్యంత వేగంగా గాలులు వీయనున్నాయని,వర్షపాతం అత్యధికంగా నమోదు కానున్నందున ప్రజలందరినీ అప్రమత్తం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. నియోజకవర్గ ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండేలా చూడాలని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఎవరూ బయటకు రాకుండా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, గుడిసెలు, పాత శిధిల




భవనాల్లో ఉన్న ప్రజలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించాలని మరియు పునరావాస కేంద్రాలలో మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రతి రెండు గంటలకు ఒకసారి తుఫాన్ పరిస్థితి తెలుసుకుని ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు.ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురుకాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి ప్రాణ,ఆస్తి నష్టాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. రానున్న రెండు రోజులు అత్యంత కీలకమైనవని సమిష్టి కృషితో తుఫాను సమర్థవంతంగా ఎదుర్కొని విపత్తు నుంచి ప్రజలను రక్షిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# టీమిండియాకు బ్యాడ్‌న్యూస్..

# సెమీస్ నుంచి డేంజరస్ ఓపెనర్ ఔట్..

**మహిళల టీ20 ప్రపంచ కప్‌లో అద్భుతంగా రాణించిన ప్రతీకా రావల్ ప్రపంచ కప్ సెమీ-ఫైనల్స్‌కు దూరమైంది. ఈ కుడిచేతి వాటం బ్యాటర్ అక్టోబర్ 30న ఆస్ట్రేలియాతో జరిగే మ్యాచ్ నుంచి తప్పుకుంది. దీంతో కీలక మ్యాచ్‌కు ముందే భారత జట్టు ఇబ్బందుల్లో పడింది.**




భారత మహిళా జట్టు ఓపెనర్ ప్రతీకా రావల్ ప్రపంచ కప్ సెమీఫైనల్‌కు దూరమైంది. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ గాయపడ్డారు. ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు ఆమె కుడి పాదానికి గాయమైంది. దీంతో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేయకుండానే వెనుదిరిగింది. దీంతో అక్టోబర్ 30న ఆస్ట్రేలియాతో జరిగే సెమీఫైనల్‌లో ఆమె ఆడలేదు. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న ప్రతీకా రావల్ లేకపోవడం టీం ఇండియాకు బ్యాడ్ న్యూస్‌గా మారింది.

**ప్రతీకా రావల్ అద్భుత ప్రదర్శన..**

2025 మహిళల ప్రపంచ కప్ గురించి మాట్లాడుతూ, ప్రతీకా రావల్ ఆరు ఇన్నింగ్స్‌లలో 51.33 సగటుతో 308 పరుగులు చేసింది. స్మృతి మంధాన తర్వాత ఆమె జట్టులో రెండవ అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణి. ప్రతీకా, మంధానతో కలిసి అనేక మ్యాచ్‌లలో టీమ్ ఇండియాకు బలమైన ఆరంభాలను అందించి, జట్టు సెమీ-ఫైనల్‌కు చేరుకోవడానికి సహాయపడింది. అయితే, కాలు గాయం కారణంగా ఆమె ఇప్పుడు ఆస్ట్రేలియాతో జరిగిన నాకౌట్ మ్యాచ్‌కు దూరమైంది.

ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, ప్రతీకా రావల్ సెమీ-ఫైనల్స్‌లో ఆడకపోతే, ఇన్నింగ్స్ ఎవరు ప్రారంభిస్తారు? బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రతీకా లేకపోవడంతో ఓపెనర్‌గా నిలిచిన అమంజోత్ కౌర్‌తో కలిసి టీం ఇండియా ఆస్ట్రేలియాతో ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశం ఉంది. మంధానతో కలిసి 52 బంతుల్లో 57 పరుగులు జోడించింది. అమంజోత్ కొత్త బంతితో కీలక ఇన్నింగ్స్ ఆడే సామర్థ్యాన్ని ప్రదర్శించింది. అయితే, హర్లీన్ డియోల్ కూడా ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశం ఉంది. ఆస్ట్రేలియాతో జరిగే సెమీ-ఫైనల్ కు భారత జట్టు యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

# పక్కటెముకల్లో తీవ్ర రక్తస్రావం..

## శ్రేయాస్ గాయంపై బీసీసీఐ కీలక అప్డేట్.. ఏమందంటే?

**సిడ్నీ వన్డేలో క్యాచ్ తీసుకుంటూ టీమిండియా ప్లేయర్ శ్రేయాస్ అయ్యర్ గాయపడిన సంగతి తెలిసిందే. అతను ఇప్పుడు సిడ్నీలోని ఐసీయూలో చేరాడు. ఈ క్రమంలో బీసీసీఐ అతని కుటుంబం నుంచి ఒకరిని సిడ్నీకి పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి.**




సిడ్నీ వన్డే సందర్భంగా ఫీల్డింగ్ చేస్తుండగా గాయపడిన శ్రేయాస్ అయ్యర్‌ను ఐసీయూలో చేర్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శ్రేయాస్ తల్లిదండ్రులను త్వరలో సిడ్నీకి పంపేందుకు బీసీసీఐ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. బీసీసీఐ వారి కోసం ఏర్పాట్లు చేస్తోందని నివేదికలు సూచిస్తున్నాయి. మీడియా నివేదికల ప్రకారం, భారత క్రికెట్ నియంత్రణ బోర్డు వీలైనంత త్వరగా కుటుంబ సభ్యులను సిడ్నీకి చేరుకునేలా ఏర్పాట్లు చేస్తోంది. అయితే, వారు ఎప్పుడు వస్తారో ఇంకా స్పష్టంగా తెలియలేదు. అతని తల్లిదండ్రులు ఇద్దరూ ప్రయాణం చేస్తారా లేదా అనేది కూడా అస్పష్టంగా ఉంది. కానీ, వీలైనంత త్వరగా ఒక కుటుంబ సభ్యుడు ఆసుపత్రిలో అతనితో పాటు ఉండనున్నట్లు తెలుస్తోంది.

**శ్రేయాస్ అయ్యర్ పక్కటెముకల లోపల రక్తస్రావం..**

శ్రేయాస్ అయ్యర్ పక్కటెముకల నుంచి రక్తస్రావం అవుతోంది. అతని ప్లీహం కూడా గాయపడింది. అందుకే అతన్ని ఐసీయూకి తరలించారు. అక్కడ అతను రాబోయే 48 గంటలు ఉంటాడు. రాబోయే 48 గంటల్లో అతని పరిస్థితి మెరుగుపడకపోతే, అతను మరో వారం రోజులు ఆసుపత్రిలోనే ఉండాల్సి రావొచ్చు. సిడ్నీలోని వైద్యుల బృందం అతన్ని నిశితంగా పరిశీలిస్తోందని, భారత క్రికెట్ జట్టు వైద్యుడు రిజ్వాన్ కూడా అతనితో ఉన్నారని నివేదికలు సూచిస్తున్నాయి. బీసీసీఐ ప్రకటన ప్రకారం, శ్రేయాస్ అయ్యర్ గాయం తీవ్రమైనది కాదు, అతను బాగా కోలుకుంటున్నాడని తెలుస్తోంది.

**శ్రేయాస్ అయ్యర్‌కు గాయాలతో విడదీయరాని సంబంధం..**

శ్రేయాస్ అయ్యర్‌కు చాలా కాలంగా గాయాలు అవుతున్నాయి. గత నాలుగు సంవత్సరాలలో అతనికి నాలుగు పెద్ద గాయాలు అయ్యాయి. 2021లో అయ్యర్ భుజం గాయంతో బాధపడ్డాడు. దానికి శస్త్రచికిత్స అవసరం అయింది. ఈ గాయం తర్వాత, అతను ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు, పంత్ బాధ్యతలు స్వీకరించాడు. 2023లో, అయ్యర్ నడుము భాగంలో గాయం కావడంతో, అతను %ఖాా%లో ఆడలేకపోయాడు. 2024లో, అతను నడుములో అసౌకర్యాన్ని అనుభవించాడు. దీంతో అతను టెస్ట్ క్రికెట్ నుంచి విరామం తీసుకోవలసి వచ్చింది. ఇప్పుడు, అతను పక్కటెముక గాయంతో బాధపడుతున్నాడు. అయితే, అయ్యర్ ప్రతిసారీ బలమైన పునరాగమనం చేశాడు. అభిమానులు ఈసారి కూడా అతని నుంచి అదే ఆశిస్తున్నారు.

# ఒక్క రోజే 25 వికెట్లు, 2 హ్యాట్రిక్స్..

# జీరోకే 13 మంది ఔట్..

### ఇలాంటి ట్విస్ట్‌ల మ్యాచ్ అస్సలు చూసి ఉండరంతే..



**హెడ్‌లైన్ చదవగానే ఆశ్చర్యం, ఆసక్తి కలగడం సహజం. క్రికెట్ చరిత్రలో నాటకీయతతో కూడిన మ్యాచ్‌లు చాలానే ఉన్నాయి. 2019 ప్రపంచ కప్ ఫైనల్‌ను ఎవరు మర్చిపోగలరు. అది మొదట టైగా ముగిసింది. ఆ తర్వాత సూపర్ ఓవర్‌లో స్కోర్లు టైగా మారాయి? ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో మ్యాచ్‌లు ఉన్నాయి. తాజాగా 2025-26 రంజీ ట్రోఫీ సీజన్‌లో జరిగిన మ్యాచ్‌లోనూ ఇలాంటి అద్భుతమే చోటు చేసుకుంది. ఇటీవలి సంవత్సరాలలో చాలా తక్కువ మంది ఈ అద్భుతాన్ని చూశారు. ఇది అస్సాం-సర్వీసెస్ మ్యాచ్‌లో జరిగింది. అస్సాంలోని టిన్సుకియాలో జరిగిన ఈ మ్యాచ్ బ్యాట్స్‌మెన్స్‌కు స్మశానవాటికగా మారింది. ఈ డేంజరస్ పిచ్ కారణంగా కేవలం రెండు రోజుల్లోనే మ్యాచ్‌లో ఫలితం వచ్చింది. అక్టోబర్ 25వ తేదీ శనివారం ప్రారంభమైన ఈ మ్యాచ్ రెండవ రోజు ఆట ప్రారంభం కాకముందే ముగిసింది. రెండు జట్ల బౌలర్లు విధ్వంసం సృష్టించారు. మొదటి రోజు 25 వికెట్లు పడగొట్టగా, రెండవ రోజు కూడా అదే ట్రెండ్ కొనసాగింది.**

**మొదట బౌలింగ్ చేస్తున్న సర్వీసెస్ తో ఇది ప్రారంభమైంది. కేవలం 19 బంతుల్లోనే రెండు వికెట్లు పడిపోయాయి. ఆ తర్వాత రంజీ ట్రోఫీ చరిత్రలో కనీవినీ ఎరుగనిది జరిగింది. 12వ ఓవర్లో, ఎడమచేతి వాటం స్పిన్నర్ అర్జున్ శర్మ వరుసగా మూడు వికెట్లు తీసి, హ్యాట్రిక్ పూర్తి చేశాడు. ఫాస్ట్ బౌలర్ మోహిత్ జాంగ్రా 15వ, 17వ ఓవర్లలో హ్యాట్రిక్ పూర్తి చేసే వరకు అస్సాం ఇన్నింగ్స్‌ను చెడగొట్టాడు. ఒకే ఇన్నింగ్స్‌లో ఇద్దరు బౌలర్లు హ్యాట్రిక్ తీయడం ఇదే మొదటిసారి.**


**ఫలితంగా అస్సాం ఇన్నింగ్స్ కేవలం 103 పరుగులకే కుప్పకూలింది. ఆరుగురు బ్యాటర్లు ఖాతా తెరవకుండానే ఔటయ్యారు. తర్వాత అస్సాం వంతు వచ్చింది. స్పిన్-ఆల్ రౌండర్ రియాన్ బౌలింగ్‌తో ప్రారంభించి ఐదు వికెట్లు పడగొట్టాడు. సర్వీసెస్‌ను 108 పరుగులకే అవుట్ చేశాడు. నలుగురు బ్యాట్స్‌మెన్స్ ఖాతా తెరవడంలో విఫలమయ్యారు.**

కానీ, ఈ నాటకీయతకు ఇంకా తెరపడలేదు. మరోసారి అస్సాం బ్యాట్స్‌మెన్స్ బాధితులయ్యారు. రెండో ఇన్నింగ్స్‌లో అస్సాం కేవలం 39 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. దీంతో మ్యాచ్ మొదటి రోజు మొత్తం 25 వికెట్లకు చేరుకుంది. రెండో రోజు, అస్సాం మిగిలిన ఐదుగురు బ్యాట్స్‌మెన్ ఎక్కువసేపు నిలవలేదు. దీంతో మొత్తం జట్టు 75 పరుగులకే ఆలౌట్ అయింది. మరోసారి, ముగ్గురు అస్సాం బ్యాట్స్‌మెన్స్ 0 పరుగులకే ఔటయ్యారు.

రెండవ రోజు ఆట ముగిసేలోపు సర్వీసెస్ కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 71 పరుగుల లక్ష్యాన్ని చేరుకుంది. రంజీ ట్రోఫీ చరిత్రలో అతి తక్కువ ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించింది. ఈ మ్యాచ్‌లో మొత్తం 32 వికెట్లు పడిపోయాయి. (మొదటి రోజు 25, రెండవ రోజు 7). వీరిలో 13 మంది బ్యాట్స్‌మెన్స్ పరుగులు చేయకుండానే ఔటయ్యారు. మరో ఇద్దరు నాటౌట్‌గా నిలిచారు.

# రోహిత్, గిల్‌పై గంభీర్ ప్రశంసలు.. కోహ్లీ ఇన్నింగ్స్‌పై కీలక వ్యాఖ్యలు..

**ఈ మ్యాచ్-విన్నింగ్ ప్రదర్శనతో రోహిత్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు లభించింది. సీనియర్ ఆటగాళ్లు జట్టుకు ఇంకా చాలా అందించగలరని ఈ ప్రదర్శన నిరూపించింది. ఈ డ్రెస్సింగ్ రూమ్ దృశ్యాలు, గంభీర్ ప్రశంసలు బీసీసీఐ సోషల్ మీడియాలో షేర్ చేసింది.**



ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో భారత్ ఘన విజయం సాధించిన తర్వాత, టీమ్ ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లను ఉద్దేశించి మాట్లాడారు. ఈ విజయంలో కీలకపాత్ర పోషించిన ఓపెనర్ల భాగస్వామ్యాన్ని, ముఖ్యంగా రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్‌ల నిలకడైన ఆటతీరును ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆ తరువాత విరాట్ కోహ్లీ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

**రోహిత్ - శుభ్‌మన్ భాగస్వామ్యంపై ప్రత్యేక దృష్టి..**

సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియా నిర్దేశించిన 237 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, ఓపెనర్లు రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ తొలి వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ భాగస్వామ్యం ఎంతో కీలకమైందని గంభీర్ అభివర్ణించారు.

గంభీర్ మాట్లాడుతూ, "బ్యాటింగ్‌లో, శుభ్‌మన్, రోహిత్‌ల మధ్య నెలకొల్పిన భాగస్వామ్యం చాలా చాలా ముఖ్యమైనదని నేను భావిస్తున్నాను. ముఖ్యంగా 60 పరుగులకు వికెట్ కోల్పోకుండా మంచి పునాది వేశారు" అని అన్నారు.

**రోహిత్-కోహ్లీల చారిత్రక ఛేజింగ్‌పై..**

గిల్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతో కలిసి అజేయంగా 168 పరుగుల అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. రోహిత్ శర్మ అద్భుతమైన సెంచరీ (121 నాటౌట్) చేయగా, కోహ్లీ 74 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ ప్రదర్శనపై గౌతమ్ గంభీర్ ఉప్పొంగిపోయారు.

గంభీర్ మాట్లాడుతూ "ఆ తరువాత రోహిత్, విరాట్ మధ్య భాగస్వామ్యం కూడా అద్భుతంగా ఉంది. ఇది చాలా క్లినికల్‌గా (నిర్ణయాత్మకంగా) కూడా ఉంది" అంటూ పొగడ్తలు ముంచెత్తారు.

**రోహిత్, కోహ్లీల గురించి గంభీర్ ప్రత్యేక ప్రశంస..**

ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ అద్భుతమైన సెంచరీని పూర్తి చేయడంతో పాటు, ఆస్ట్రేలియాపై భారత్‌కు ఓదార్పు విజయాన్ని అందించడంలో వారిద్దరి కృషిని గంభీర్ కొనియాడారు. గంభీర్ ప్రత్యేకంగా రోహిత్‌ను ప్రస్తావిస్తూ, "మరో సెంచరీ చేసిన 'రో' (రోహిత్ శర్మ)కి ప్రత్యేక అభినందనలు. అద్భుతమైన ఇన్నింగ్స్! అన్నిటికన్నా ముఖ్యమైన విషయం ఏంటంటే, నువ్వు ఈ మ్యాచ్‌ను ముగించావు. విరాట్ కూడా అలాగే!" అని అన్నారు. ఈ మ్యాచ్-విన్నింగ్ ప్రదర్శనతో రోహిత్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు లభించింది. సీనియర్ ఆటగాళ్లు జట్టుకు ఇంకా చాలా అందించగలరని ఈ ప్రదర్శన నిరూపించింది. ఈ డ్రెస్సింగ్ రూమ్ దృశ్యాలు, గంభీర్ ప్రశంసలు బీసీసీఐ సోషల్ మీడియాలో షేర్ చేసింది.

# నా పరువు తీస్తున్నారు..

## డీప్‌ఫేక్ వీడియోలపై పోలీసులకు చిరంజీవి ఫిర్యాదు

- **ఏఐ మార్ఫింగ్ వీడియోలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన చిరంజీవి**
- **తన పేరు, ఫొటోలతో అశ్లీల వీడియోలు సృష్టిస్తున్నారని ఆరోపణ**
- **పలు వెబ్‌సైట్లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు**
- **ఐటీ చట్టం, భారతీయ న్యాయ సంహిత కింద పలు సెక్షన్లపై కేసు నమోదు**
- **దశాబ్దాల తన కీర్తి ప్రతిష్ఠలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారని ఆవేదన**



టాలీవుడ్ అగ్ర నటుడు, మెగాస్టార్ చిరంజీవి తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కొన్ని వెబ్‌సైట్లు వ్యవహరిస్తున్నాయని ఆరోపిస్తూ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని ఉపయోగించి, తన ముఖాన్ని మార్ఫింగ్ చేసి అశ్లీల (పోర్న్) వీడియోలను సృష్టిస్తున్నారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చిరంజీవి ఫిర్యాదు మేరకు పోలీసులు ఐటీ చట్టంలోని సెక్షన్లు 67, 67ఏ, భారతీయ న్యాయ సంహిత (%దీచీూ%)లోని సెక్షన్లు 79, 294, 296, 336(4)తో పాటు పలు ఇతర చట్టాల కింద కేసు నమోదు చేశారు. తన పేరు, ఫొటోలు, పోలికలను ఉపయోగించి కొన్ని వెబ్‌సైట్లు ఏఐ టెక్నాలజీతో నకిలీ అశ్లీల వీడియోలను రూపొందించి, ప్రచురించి, ప్రచారం చేస్తున్నాయని చిరంజీవి ఆరోపించారు. 'మీనాక్షి' అనే మహిళతో పాటు ఇతరులతో తాను అసభ్యకరమైన లైంగిక చర్యలలో పాల్గొన్నట్లుగా ఈ వీడియోలను సృష్టించారని ఆయన తెలిపారు. "ఈ వీడియోలు పూర్తిగా నకిలీవి. వీటిని డీప్‌ఫేక్ పోర్నోగ్రఫీగా పిలిచే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో సృష్టించారు. నా ముఖ కవళికలను, రూపాన్ని చట్టవిరుద్ధంగా మార్ఫింగ్ చేసి అశ్లీల కంటెంట్‌గా మార్చారు" అని చిరంజీవి తన ఫిర్యాదులో వివరించారు. ఈ వీడియోలను రూపొందించడం, అప్‌లోడ్ చేయడం, ప్రచారం చేయడంలో పాలుపంచుకున్న అన్ని వెబ్‌సైట్లు, వ్యక్తులు, సంస్థలపై తక్షణమే క్రిమినల్, టెక్నికల్ విచారణ చేపట్టాలని ఆయన పోలీసులను కోరారు. ఇంటర్నెట్ నుంచి ఈ కంటెంట్‌ను వెంటనే బ్లాక్ చేసి, తొలగించాలని డిమాండ్ చేశారు. తాను ఒక ప్రముఖ సినీ నటుడిగా, ప్రజా ప్రతినిధిగా, కేంద్ర మాజీ మంత్రిగా చిత్ర పరిశ్రమకు, సమాజానికి ఎనలేని సేవలందించానని చిరంజీవి గుర్తుచేశారు. "దశాబ్దాలుగా ఎంతో కష్టపడి, నిజాయితీతో పనిచేసి ఒక కళాకారుడిగా, పౌరుడిగా గౌరవాన్ని, మర్యాదను సంపాదించుకున్నాను. నా సినిమాలు కూడా ఎప్పుడూ సమగ్రత, కరుణ వంటి విలువలను ప్రతిబింబిస్తాయి. సామాజిక సేవ ఫ్యాషన్‌గా మారకముందే నేను ఆరోగ్య సంరక్షణ, విద్య, రక్తదానం, విపత్తు సహాయం వంటి కార్యక్రమాలు చేపట్టాను" అని ఆయన పేర్కొన్నారు. ఈ డీప్‌ఫేక్ వీడియోల వల్ల తాను కష్టపడి సంపాదించుకున్న కీర్తి ప్రతిష్ఠలకు తీవ్రమైన, కోలుకోలేని నష్టం వాటిల్లుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్లో తనపై ఉన్న సద్భావాన్ని దెబ్బతీయాలనే దురుద్దేశంతోనే ఈ నకిలీ వీడియోలను ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇది తన గోప్యత, గౌరవం, మర్యాదలకు భంగం కలిగించడమేనని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద లభించిన హక్కులను ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు. ఈ వీడియోల ప్రచురణ వెనుక వ్యవస్థీకృత, హానికరమైన కుట్ర దాగి ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.



## బాక్సాఫీస్ వద్ద రష్మిక మందన్న

# చిత్రం సందడి...

## 100 కోట్ల క్లబ్ దిశగా పరుగులు

బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్న జంటగా నటించిన హారర్-కామెడీ చిత్రం 'థమ్మ' బాక్సాఫీస్ వద్ద నిలకడగా వసూళ్లను రాబడుతోంది. దీపావళి కానుకగా విడుదలైన ఈ సినిమా, ఆరు రోజుల్లో దేశవ్యాప్తంగా రూ. 91.70 కోట్లు వసూలు చేసి, 100 కోట్ల క్లబ్‌కు చేరువలో ఉంది. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మంచి అంచనాల మధ్య థియేటర్లలోకి వచ్చింది. ట్రేడ్ వర్గాల లెక్కల ప్రకారం, ఆదివారం (ఆరో రోజు) ఈ సినిమా సుమారు రూ. 13 కోట్లు రాబట్టింది. శనివారం నాటి రూ. 13.10 కోట్ల వసూళ్లతో పోలిస్తే ఇది స్వల్పంగా తక్కువ. దీపావళి మరుసటి రోజు రూ. 24 కోట్లతో భారీ ఓపెనింగ్ సాధించిన ఈ చిత్రం, ఆ తర్వాత రోజుల్లో కొంత నెమ్మదించింది. బుధవారం రూ. 18.60 కోట్లు, గురువారం (భాయ్ దూజ్) రూ. 13 కోట్లు, శుక్రవారం రూ. 10 కోట్లు వసూలు చేసింది. అయితే, వారాంతంలో మళ్లీ పుంజుకున్నా, తొలిరోజు వసూళ్లను మాత్రం దాటలేకపోయింది. ఈ వివరాలను ప్రముఖ ట్రేడ్ అనలిటిక్స్ సంస్థ సాక్‌నిల్క్ వెల్లడించింది. హిందీ, తెలుగు భాషల్లో విడుదలైన ఈ చిత్రానికి హిందీ వెర్షన్ నుంచే అధిక ఆదాయం వస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా ఆరు రోజుల్లో కేవలం రూ. 70 లక్షలు మాత్రమే వసూలు చేయడం గమనార్హం. మ్యాడాక్ ఫిలిమ్స్ హారర్-కామెడీ యూనివర్స్‌లో వచ్చిన 'స్త్రీ', 'భేదియా', 'ముంజ్యా' కంటే 'థమ్మ' మెరుగైన ప్రదర్శన కనబరిచినప్పటికీ, 'స్త్రీ 2' సృష్టించిన రికార్డును మాత్రం అందుకోలేకపోయింది. 'థమ్మ' దాదాపు వారం రోజుల్లో సాధించిన వసూళ్లను 'స్త్రీ 2' కేవలం మూడు రోజుల్లోనే రాబట్టింది. ఇక, దీపావళి బరిలో నిలిచిన మరో హిందీ చిత్రం, హర్షవర్ధన్ రాణే నటించిన 'ఏక్ దీవానే కీ దీవానియత్' ఆరు రోజుల్లో రూ. 41.25 కోట్లు వసూలు చేసింది.

# త్వరలో 'కిల్లర్' విడుదల

'శుక్ర', 'మాటరాని మౌనమిది', 'ఏ మాస్టర్ పీస్' వంటి డిఫరెంట్ సినిమాలను తెరకెక్కించిన దర్శకుడు పూర్వాజ్ 'కిల్లర్' అనే సై-ఫై యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయనే కథానాయకుడు. జ్యోతి పూర్వజ్ కథానాయిక. విశాల్‌రాజ్, దశరథ, చందూ, గౌతమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఉర్వీష్ పూర్వజ్ సమర్పణలో ఎయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూర్వాజ్ ప్రజరు కామత్, ఎ.పద్మనాభరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న రెండో చిత్రమిది. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయని నిర్మాతలు తెలిపారు. త్వరలోనే సినిమా విడుదల తేదీనిప్రకటిస్తామని పేర్కొన్నారు. సినిమాటోగ్రఫీ జగదీష్ బొమ్మిశెట్టి, సంగీతం ఆశీర్వాద్, సుమన్ జీవ, విఎఫ్‌ఎక్స్, వర్చువల్ ప్రొడక్షన్, లైన్ ప్రొడ్యూసర్ దశరథ, రచన, దర్శకత్వం పూర్వాజ్.



# నాన్నను తప్పుదారి పట్టించారు

## ఐరన్ లెగ్ శాస్త్రి తనయుడు ప్రసాద్!


**హాస్య నటుడిగా ఐరన్ లెగ్ శాస్త్రికి పేరు**
**500లకి పైగా సినిమాలు చేశారన్న ప్రసాద్**
**తనకి ఎవరూ సాయం చేయలేదని వెల్లడి**
**అవమానాలు మిగిలాయని ఆవేదన**
**చదువుకుని లైఫ్ లో స్థిరపడ్డానని వివరణ**

ఒకప్పుడు తెలుగు తెరపై సందడి చేసిన కమెడియన్స్ లో 'ఐరన్ లెగ్ శాస్త్రి' ఒకరు. తెరపై హాస్యభరితమైన పురోహితుడి పాత్ర చేయాలంటే ముందుగా ఆయననే సంప్రదించేవారు. అప్పట్లో ఆయన లేని సినిమా దాదాపుగా ఉండేది కాదు. అలాంటి ఆయన చివరి రోజులలో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతూ చనిపోయారు. ఆయన తనయుడు ప్రసాద్, తాజాగా 'హిట్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. అనేక విషయాలను గురించి ప్రస్తావించారు. "మా నాన్న దాదాపు 500 సినిమాలలో నటించారు .. 100 సీరియల్స్ వరకూ చేశారు. అయినా ఆయన సంపాదించింది ఏమీ లేదు. ఎందుకంటే చాలామంది డబ్బులు ఎగ్గొట్టారు .. కొంతమంది భోజనం పెట్టి పంపించేవారు. బ్రాహ్మణుడు కావడం వలన ఆయనకి ఆత్మాభిమానం ఎక్కువ. అందువలన ఎవరినీ ఏమీ అడిగేవారు కాదు. అలాంటి ఆయనను కొంతమంది తప్పుదారి పట్టించారు. మందుపార్టీలు .. సిట్టింగ్స్ లో ఉంటేనే ఛాన్సులు వస్తాయని చెప్పి, తాగుడు అలవాటు చేశారు" అని అన్నాడు. "నానా తాగుడికి అలవాటైన తరువాత ఉన్న ఛాన్సులు కూడా పోయాయి. మళ్లీ పౌరోహిత్యం వైపు రాలేని పరిస్థితి. ఆయన నాకు ఇచ్చింది ఏమీ లేదు. ఆయన చనిపోయినప్పుడు కార్యక్రమాల కోసం అవసరమైన డబ్బు కూడా బంధువులే ఏర్పాటు చేశారు. ఐరన్ లెగ్ శాస్త్రి తనయుడిగా నన్ను ఎవరూ గౌరవించలేదు .. అవకాశాలు ఇచ్చింది లేదు .. పైగా అవమానించారు. అందువల్లనే నేను చదువుపై దృష్టి పెట్టాను. ఎంబీఏ .. సీఏ పూర్తి చేసి మంచి పొజిషన్ లో ఉన్నాను" అని చెప్పాడు.




## 'కృష్ణ లీలా' ట్రైలర్ విడుదల

దేవన్, ధన్య బాలకృష్ణన్ హీరో హీరోయిన్లుగా నటిస్తోన్న తాజా చిత్రం 'కృష్ణ లీలా'. దేవన్ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'తిరిగొచ్చిన కాలం..' అనేది ఈ మూవీకి ట్యాగ్‌లైన్. ఈ సినిమాను మహాసేన్ విజువల్స్ బ్యానర్‌లో జ్యోత్స్న నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో వినోద్ కుమార్, పృథ్వీ (పెళ్లి), రవి కాలే, తులసి, 7ఆర్ట్ సరయు, ఆనంద్ భరత్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.






## 2న 'చౌదరి గారి అమ్మాయి' ప్రీమియర్ షో

ఎల్లో టకోమా ప్రొడక్షన్ బ్యానర్‌లో ఎడ్‌కాన్ ప్లస్ సంస్థ నిర్మించిన సినిమా 'చౌదరి గారి అమ్మాయి' ప్రీమియర్ షో నవంబర్ రెండోతేదీన విజయవాడలోని శైలజ థియేటర్‌లో ప్రదర్శించనున్నారు. సిద్ధూ వర్మ కాకాని దర్శకత్వంలో తెరకెక్కిన వినరుతేజ్, రిషిత జోడీగా నటించారు. డిఒపి మహేష్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆదిత్య ఆత్రేయ, కో రైటర్‌గా సామ్, మేకప్ పెనుమాక నాని. కథ, స్క్రీన్ ప్లే, డైలాగులు, ఎడిటింగ్, దర్శకత్వం సిద్ధువర్మ. ఆదివారం ఉదయం 9 గంటలకు ఈ షో ఏర్పాటు చేసినట్లు చిత్ర యూనిట్ తెలిపింది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339